ప్రబుద్ధాంధ్ర

సంపుటము ౯] రాజమహేంద్రవరము ౧౦ మే ౧౯౩౯ 1939 [౨ వ సంచిక

వ్యాఖ్యానములు

అక్షరాలా యీపనే చేశారు

గాంధిగారి తీపికల్లు ప్రచారం

వేంకటాచలంశెట్టిగారి ధర్మనిర్ణయం

రంగాగారు మేలుకున్నారు మెట్టుకి

మద్రాసు రేడియో బ్రాంచి

కాంగ్రెసు చరిత్రలో ఒకక్లిష్టిక కాబోయే ధర్మసందేహం

కలకత్తా ఏ. ఐ. సీ. సీ. పర్యవసానం యిదీ

గుంటూరి ప్రయత్నాలు

ఆంధ్రరాష్ట్రం యింతట్లో రాదు

"అనిర్లోడితకార్యస్య వాగ్జాలం వాగ్మినో వృథా"

అరవల జైత్రప్రస్థానం ప్రారంభ మైనది

వ్యాసములు

కావ్యసృష్టి

చెన్నపట్నంలో తెనుగుపిల్లలికి జరుగుతూఉన్న అన్యాయం

ప్రగల్భాలు

అముద్రితగ్రంథములు—వరదరాజ రామాయణము

సంపాదకుడు

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి చిన్నకథలు

తయారైవున్నవి

1	గూడు మారిన కొత్తరికం	0—2—0
2	కలంపోటు	0—2—6
3	తల్లిప్రాణం	0—2—6

అచ్చులో వున్నవి

1	ఇల్లుపట్టిన వేధ వాడబడుచు	0—4—0
2	అన్నంతపనీ జరిగింది	0—4—0

శాస్త్రిగారి గ్రంథాలు మరికొన్ని

1	రక్షాబంధనం. డిటెక్టివునవల	1—0—0
2	శ్మశానవాటిక. డిటెక్టివునవల	0—8—0
3	వారకాంత నాటకం	0—4—0
4	విజయనగరరాజుల కథలు. పిల్లలనిమిత్తం	0—2—0
5	చిత్తూరురాజుల కథలు. పిల్లలనిమిత్తం	0—3—0

భమిడిపాటి కామేశ్వరరావుగారి గ్రంథాలు

1	అవును	0—8—0
2	ఇప్పుడు	0—8—0
3	నిజం	0—8—0
4	కాలక్షేపం	0—8—0
5	అప్పుడు	0—8—0
6	మాటవరస	0—8—0

కావలసినవారు,

కలాభివర్ధనీ పరిషత్తు - రాజమండ్రి

అని వ్రాయాలి



సంపుటము [ ] రాజమహేంద్రవరము : శా. శ. ౧౮౬౧ వైశాఖం ౧౦ మే ౧౯౩౯ [౨ వ సంచిక

వ్యాఖ్యానములు

అక్షరాలా [illegible] చేశారు.

"ప్రస్తుతమున ప్రధానమంత్రిగారు ఇండియామంత్రితో రాష్ట్రవిభజనవిషయమై జరిపిన ఉత్తరప్రత్యుత్తరములలో లోపము గల దని కొందరు తలంచుచున్నారు. వారు వ్రాయుటలో ఏలోపమును లేదు. వారికంటే వ్రాయు వారు మరియొకరు లేరు. వారు చేయవలసినంత కృషి చేసినారు. ఆయనకంటే రాజకీయవేత్త మరి లేడు"

గతనెల ౨౧ వ తేదీని గుంటూరి పౌరసభలో మాట్లాడుతూ అధ్యక్షులైన కొండా వేంకటప్పయ్య పంతులుగారిలా సెలవిచ్చారు.

సందేహ మేమిటి?

ఇందులో ఆవగింజంతైనా అసత్యం లేదు.

అతిశయోక్తి కూడా లేదు.

రాజగోపాలాచార్యులుగారు గొప్ప రాజనీతివేత్తలలో వొకరు.

గొప్ప రాజకార్యనిర్వాహకులలో కూడా వారొకరు.

ఇంతే కాదు.

ఆంధ్రరాష్ట్రవిభజన విషయమై, వారు, ఎంత రాయాలో—ఎంత గట్టిగా రాయాలో అంతా—అంత గట్టిగానూ రాశారు.

వారు జరిపిన ఉత్తరప్రత్యుత్తరాలలో ఎలాంటి లోపమూ లేదు.

ఎంత మాత్రమున్నూ లేదు.

ఉన్న దనుకోవడం శుద్ధ అవివేకం.

అయితే?

ఏమిటి అయితే?

వేంకటప్పయ్య పంతులుగారు ఈవిషయం జారవిడిచేశారు.

రాజగోపాలాచారిగారు చెయ్యవలసినంత కృషి చేసి వుంటే, మరి, యిండియా మంత్రి ఆంధ్రరాష్ట్రవిభజన కెందుకు పూనుకోలేదూ?

మంత్రాంగభాధ్యత వహించినప్పణ్ణుంచి తామంటే బ్రిటిషువారు హడలెత్తిపోతున్నారని కేరింతాలు కొడుతున్నారే కాంగ్రెస్సువారు?

అదంతా అబద్ధ మేనా?

కాంగ్రెస్సు మంత్రుల డిమాండంటే జనసామాన్యం పంపుకునే మహజరును చూసినట్టు చూసే స్థితిలోనే వున్నారా బ్రిటిషువారు?

తమ మాటలు కాంగ్రెస్సునే యిలా న్యూనతపరుస్తా యని వేంకటప్పయ్యపంతులుగారు గుర్తించుకోలేదు.

...టలు రాజనీతివేత్తల ధోరణికి ...గా వున్నవి.

...లకు కాంగ్రెస్సులో పలుకుబడీ కలిగించ

...లంటే ఆచారిగారికి లక్ష్యం వుండేటట్టూ

...రాష్ట్రప్రయత్నాలకు బలమూ కూర్చలేవు.

...కి :

ఆంధ్రరాష్ట్రనిర్మాణం విషయమై, ఆచారిగారు, ఇండియామంత్రికి గట్టిగా రాసి వుండరని మనవారిలో అనేకులకు బలంగానే అనుమానా లుండడం మే మెరుగుదుం.

అయితే, అలా అనుమానించేవారు వేత్తలు కారు.

వారు రాజనీతీ యెరగరు.

రాజనీతిపరిజ్ఞాతల పోకిళ్లూ గుర్తించలేరు.

వారి అనుమానం గుర్తించవలసిందే కాదు

ఏమంటే ?

ఎప్పటి కయినా తమకీ, యిండియామంత్రికీ జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలు ప్రకటించవలసిన అగత్యం యేర్పడుతుం దని వూహించుకోలేనివారా ఆచారిగారు ?

అలా వూహించుకోగలవా రెవరైనా ప్రతిపక్షులకు దొరికిపోయే రాతలు రాస్తారా ?

రాజనీతివేత్త లయినవారు మాటల్లోనే దొరకరే, రాతల్లోనా దొరికిపోతారు ?

కనక, ఆచారిగారు గట్టిగానే రాశా రని ప్రచారం చెయ్యడానికి పూనుకోవడం పరప్రత్యయనేయబుద్ధులకే గాని పరిణతబుద్ధులకు తగినది కాదు.

నిజం చెప్పవలసివస్తే, ఆచారిగారు, కావలసిన దానికంటే యెక్కువ దృఢంగానే రాసివుంటారు.

ఇండియా మంత్రి ఆంధ్రరాష్ట్రవిభజనకు పూనుకోకుండా చేసే బీజం అసెంబ్లీ కాంగ్రెస్సు పార్టీ నిర్ణయంలోనే పడినది.

వేంకటప్పయ్యపంతులుగారు ప్రతిపాదించిన తీర్మానంలోనే అది మొలకలెత్తి వుండినది.

ఇక, ఆచారిగారికి, నెపం తమ మీద వేసుకోవలసిన ఆవశ్యకం యేమిటీ ?

ఆదికాలంలో బోధపడకపోయినా యీ రహస్యం వేంకటప్పయ్యపంతులుగారి కిటీవల చక్కగానే గుర్తుకి వచ్చింది.

తప్పంతా తమదే గాని ఆచారిది కాదని వారికి పూర్తిగానే తెలిసిపోయింది.

వారికే కాదు, వారు నోటీ సిచ్చిన తీర్మానం, ప్రతిపాదించబడ్డ రూపంలో రచించబడ్డప్పుడే తామంతా అర్థజ్ఞానం కోల్పోయి వుండినట్టు కాంగ్రెస్సాంధ్రులకందరికీ కూడా అవగాహన అయిపోయింది.

కాని యేమిటి చెయ్యడం ?

అంతా స్వయంకృతాపరాధం.

దాన్ని మాటు చేసుకోవా లంటే ఆచారిగారిని పొగడాలి.

ఆంధ్రరాష్ట్రవిభజనప్రయత్నాలకు కాంగ్రెస్సుమంత్రులూ, కాంగ్రెస్సు వర్కింగు కమిటీ సభ్యులూ కలిగించిన అభ్యంతరాలూ, ఇప్పటికీ చూపిస్తున్న ప్రాతికూల్యమూ ఇండియామంత్రిమీద వుంచాలి.

తాము నయవంచనలో తగుల్కొని ఆంధ్రరాష్ట్రోద్యమం రసాభాసు చేసినట్టు ప్రజలకు తోచకుండా చేసుకోవాలి.

మన వేంకటప్పయ్యపంతులుగారు, ఈమాటలు చెప్పడంలో అక్షరాలా యీ పనే చేశారు.

గాంధిగారి తీసికల్లు ప్రచారం

బొంబాయినగరంలో సంపూర్ణమద్యనిషేధం ప్రారంభించబోతున్న కాంగ్రెస్సు మంత్రులను నిరసిస్తూ అక్కడి పార్శీలు చేస్తున్న తర్జనభర్జనలు కాంగ్రెస్సు మూలవిరాట్టులను కూడా వూపి విడిచిపెట్టేశాయి.

పార్శీస్త్రీలు కూడా యీ వుద్యమంలో చేరి పురుషులను మరింత రెచ్చగొట్టారు.

మంత్రులకు క్లిష్టపరిస్థితులు సంభవించేటట్టు కనపడింది.

దాంతో గాంధిగారు తెరవెడలవలసివచ్చింది.

"మద్యనిషేధం తీపికల్లు (నీరా) కు వర్తింప దన్న సంగతి ప్రతికూలప్రచారం చేస్తున్నవారు మరిచిపోవద్దు. అందుచేత పార్శీలకు ఈతీపికల్లు ఉన్నది. వారు దీనిని వాడవచ్చును. చెరకురసం యెంత ఆరోగ్యకరమో ఈ తీపికల్లు అంత ఆరోగ్యకరము. ఇది త్వరగా పులిసిపోకుండా వుంచడానికి ఒక మార్గం కనిపెడితే ఇది చాల చవుకగా దొరకవచ్చును. తక్కిన తీపిరసాలకన్నా ఇది వేగిరం పులిసిపోతుంది"

పార్శీలను పొగిడిపొగిడి, గాంధిగారు, చివరికి వారినిలా లాలించారు.

గాంధిగారి జీవితచరిత్రలో మరుగున వుండిపోయిన వొక రసవత్తరఘట్టం, ఇంత కాలానికయినా బయటికి రావడం చాలా గొప్ప సంగతి.

గజాననాయకుగారి హరిజనవ్యాసం చూసి "గాంధిగారు యీపని కంగీకరిస్తారా?" అని సంశయగ్రస్తులయిన వారు ఇప్పుడయినా చప్పబడి వూరుకుంటా రని భావిస్తున్నాము.

దీన్నిబట్టి చూస్తే, తీపికల్లు జాతీయపానీయంగా చెలామణీ అయేటట్టు ఆశ్రమవాసులు చేస్తున్న ప్రయత్నాలు గాంధిగారు నిర్దేశించినవే అని స్పష్టపడిపోతున్నది.

ఆదినుంచీ గాంధిగారు మద్యంపట్ల చూపిస్తున్న ప్రాతికూల్యానికి యీదొడ్డిదారి మొదట్లోనే యేర్పడి వున్నదా?

అయితే, యింతవరకూ అదెందుకు తెరిచాయకాదూ?

మద్యనిషేధం ధర్మమూ అగత్యమూ అని బోధించడానికి ప్రారంభించినప్పుడే గాంధిగారు తీపికల్లు మహిమలు వర్ణించడం మొదలుపెట్టి వుంటే కాంగ్రెసు బలగమూ బలమూ యింకా యెక్కువ అయి వుండేది.

అయితే:

మద్యనిషేధశాసనా లమలుపరిచిన గాంధిగారి కాంగ్రెస్సుమంత్రులు తీపికల్లును మినహాయించి వున్నారా? తీపికల్లు గీసేవారికీ, అమ్మేవారికీ, పుచ్చుకునేవారికీ యెలాంటి యిబ్బందులూ కలక్కుండా వుండేటట్టు వారు, ఆశాసనంలో విశేషవిధు లేర్పరిచివున్నారా?

ఇదివర కలా జరిగి వుండకపోతే గాంధిగారామార్పులు చేయిస్తారా?

ఇంతకీ:

పార్శీ లందరూ తాగుబోతు లేనా?

అంచేత నేనా పార్శీస్త్రీలు కూడా యీప్రాతికూల్యం కనపరుస్తున్నది?

మద్యనిషేధం పనికిరా దనేవారి నందరినీ "మీకు తీపికల్లు వుండనే వున్నదే. మరెందుకూ ద్వేషం?" అనడం గర్హ్యంగా వున్నది.

ఈధోరణి తీపికల్లు ప్రచారానికి పనికిరావచ్చు; గాని మద్యనిషేధప్రతికూలవాదుల సిద్ధాంతాలను మార్చడానికి చాలదు.

భరతఖండంలోకల్లా పార్శీలే గొప్ప ఐశ్వర్యవంతులు.

బొంబాయిలో, వారిలో చాలామంది మద్యవర్తకులుగా వున్నారు.

ఇతరచోట్ల కూడా పార్శీలకు అది ముఖ్యవృత్తి.

పార్శీల ఒక్కొక్క బ్రాందీషాపు లక్షలూ కోట్లూ విలవ చేస్తుంది.

తమ సర్వస్వమూ బ్రాందీషాపులలో పెట్టి వారు వ్యాపారం సాగిస్తున్నారు.

గాంధిగారి కాంగ్రెస్సుమంత్రుల ఈ అస్వాభావికపరిపాలనంవల్ల ఆజాతికి జాతి అంతా తల్లకిందు లయిపోతుంది.

వారి ఆర్థికవ్యవహారా లన్నీ తారుమా రయిపోతాయి.

ఆ ఐశ్వర్యవంతులలో అనేకవేలమంది దివాలా పాలు కావలసివస్తుంది.

ఇదేమీ యోచించకుండా "మీకు తీపికల్లు వున్నది తాగం డయ్యా." అనడం హేళన తప్ప మరేమీ కాదు.

ఏతావతా.

పార్టీమధ్యవర్తులను ఒకము వెనక వేసుకురావలసిన అగత్యం యేమీ లేదు.

వారి భవిష్యత్తును వారు దిద్దుకోగలరు

తమకి తామే వారు రక్షించుకోగలరు.

ఇక వున్నదల్లా యేమి టంటే?

మద్యపానం అంతరించడానికి తీవ్రశాసనాలు చేయిస్తున్న గాంధిగారు, తీపికల్లుకు నిషేధం లేదనడమూ, తీపికల్లు జాతీయపానీయం అయేటట్టు ప్రచారం చెయ్యడమూ అర్థం లేని పని.

ఔచితి మాలిన పని.

జాతిని తప్పుదారికి మళ్లించే ఘోరకృత్యం.

వేంకటాచలంశెట్టిగారి ధర్మనిర్ణయం

"కాంగ్రెస్సు ప్రభుత్వములు ఏసూత్రములను, ప్రణాళికను అనుసరించి రాజ్యాంగము నడుప సిద్ధపడినవో వానిని పన్నులు హెచ్చింపకుండ, ప్రస్తుత మున్న పన్నులను మార్చకుండ నెరవేర్చజాలనిచో యీనూతనచట్టమును భగ్నము గావించుట యీప్రభుత్వముల విధియై యున్నది. ఈచట్టమునందు గల హెచ్చుతగ్గుల సవరించుటకు కాంగ్రెస్సువారి ప్రత్యేకశక్తు లవసరములేదు."

కాకినాడలో (౧౬—౪—౩౯) జరిగిన ఆంధ్రరాష్ట్ర వర్తకమహాసభలో అధ్యక్షత వహించిన సామి వేంకటాచలంశెట్టిగారు ప్రకటించిన ధర్మనిర్ణం యిది.

యుక్తియుక్తంగా వున్నది.

శాస్త్రీయంగానూ వున్నది.

మద్యపానం నిషేధిస్తామనీ, పన్నులు తగ్గిస్తామనీ చెప్పి కాంగ్రెస్సువారు శాసనసభలు ప్రవేశించారు.

అధికారం చేత పుచ్చుకునే కొత్తయిండియాశాసనం భగ్నం చేస్తామని చెప్పి వారు మంత్రిపదవులు స్వీకరించారు.

కాంగ్రెస్సువారి యీశపథాలు మననం చేసుకుంటూ ఆలోచించగలిగితే శెట్టిగారి యీనిర్ణయం యెవ రాక్షేపించగలరూ?

మద్యనిషేధం విషయంలో కాంగ్రెసువారు ప- తప్పకపోవడం బాగానే వున్నది.

మరి పన్నుల విషయంలో కూడా వారు శీలం నిలుపుకోవద్దూ?

కాని అధికారవ్యామోహం వారిని గుప్పిట్లో యిరికించుకున్నది.

చేదుకే అలవాటుపడిపోయి వున్న నోటికి యింతీపి తగలడంతోటే వారు పరవశు లయిపోయారు.

లేకపోతే యిలాంటి ధర్మనిర్ణయాలకు అగత్యం యేమిటీ?

మద్యనిషేధంవల్ల ఆదాయం తగ్గిపోయింది.

ఆలోటు పూడితే గాని పరిపాలన నడవదు.

అనవసరంగానూ, అస్వాభావికంగానూ, అక్రమంగానూ పెరిగిపోయి వున్న ఖర్చుల భారం తగ్గించుకోవాలంటే శాసనంలో అవకాశాలు లేకపోయాయి.

దీనితో విషమసమస్య యేర్పడింది.

"దీని కేం చెబుతారూ?"

ఇది వక దైన ప్రశ్న.

కొత్త యిండియాశాసనాన్ని కుదించి పారేసే ప్రశ్న యిది.

పంచ "త్రింశత్కోటికంఠకలకలనినాదకరాళ" మైనది యీప్రశ్న.

వెటకారంగా చిరునవ్వు నవ్వుతూ—శిరఃకంపం చేస్తూ దర్జాగా అడిగితే బ్రిటిషుపార్లమెంటును గగ్గోలుపరిచేసే ప్రశ్న యిది.

కాని, సత్తా లేక—యోగ్యత చాలక—కాంగ్రెస్సు మంత్రుల స్వరపేటికలు దీనికి వాహకాలు కాలేకపోయాయి.

పెదవులు కదిపితే మంత్రిపదవులు యెగిరిపోయేటట్టు కనపడ్డాయి వారికి.

దాంతో బ్రిటిషువారిమీద ప్రయోగించవలసిన యీప్రశ్నను కాంగ్రెస్సుమంత్రులు ప్రజలమీదకు విసిరేశారు.

"ప్రజలు పన్ను లివ్వకపోతే ప్రభుత్వం నడుస్తుందా? ఇది మన యిల్లు. మన సంసారం. మన వాకిలి. మన

ప్రభుత్వం కాబట్టి మనం దీనిని ఎలాగయినా చక్క బెట్టుకోవాలి" అని వారు ప్రచారం ప్రారంభించారు.

"వర్తకులు ఇండియాప్రభుత్వానికే గాని రాష్ట్రీయ ప్రభుత్వాల కేమీ పన్ను లివ్వడం లేదు. కాబట్టి యిది తప్పదు" అంటున్నారు వారు.

"వర్తకులు కొనేవాళ్లను దోచేస్తున్నారు. కనక దీని కంగీకరించితీరా" లని నిరసిస్తూ బలవంత పెడుతున్నారు.

"రాజుగారి ప్రభుత్వం నడవక తప్ప" దనే జస్టిస్సు వారికే గాని "యిండియాశాసనం బద్దలుకొట్టేస్తా" మన్న కాంగ్రెస్సువారి కీవిధానం అర్హ మైనదా?

ఎలాగో వాకలాగ బడ్జెట్టు సరిపుచ్చుకుని "సుఖ సంసారం" గడుపుకుందా మన్న కక్కుర్తి పుద్దేశం తోటేనా కాంగ్రెస్సువారు మంత్రిపదవులు పుచ్చుకునే టప్పుడు బ్రిటిషుఅధికారులవల్ల హామీలు పుచ్చుకున్నారు?

శాసనాతిక్రమణం కాకుండా నద్దుకుపోవడమే పుద్దేశమయితే మాంటుఫర్డుశాసనం నిర్వహించుకుపోయిన జస్టిస్సువారే యీ 3౫ వ సంవత్సరం కొత్తశాసనం కూడా నిర్వహించేస్తురే యిక యీకాంగ్రెస్సువారెందుకూ?

"ఈ చట్టమునందుగల హెచ్చుతగ్గుల సవరించుటకు కాంగ్రెస్సువారి ప్రత్యేకశక్తు లవసరము లే" దంటున్నారు వేంకటాచలంశెట్టిగారు.

కాంగ్రెస్సుమంత్రుల కిది యెంత వజ్రాఘాతమో కాంగ్రెస్సు ప్రముఖుల కేమయినా బోధపడ్డదా?

ఈ మాటలో, వర్తకుల శ్రేయస్సు సాధించా లనే పుత్కంఠకంటే కాంగ్రెస్సు ఘనతను కాపాడా లనే ఆవేదనే యెక్కువగా వుండడం కాంగ్రెస్సు ప్రముఖులకు కనపడుతున్నదా?

కాని,

ఇవాళ, కాంగ్రెస్సు వలయంలో—ముఖ్యంగా మద్రాసు నగరంలో—అరవల పర్యవేక్షణం కిందా, గుజరాతీల ఆంధ్రదినపత్రికలోనూ శెట్టిగారిని గురించి యెలాంటి దుష్ప్రచారం జరుగుతున్నదో మేము గుర్తిస్తూనే వున్నాము.

నిజంగా, యీస్థితిలో, శెట్టిగారి యీమాటలు కాంగ్రెస్సువారి దురాగ్రహానికి వుద్దీపకాలే అవుతా యనిన్నీ మే మెరుగుదుము.

అయితే,

ఈ సందర్భంలో యింత లెస్సగా సత్యం నిరూపించినవారొక్క వెంకటాచలంశెట్టిగారు తప్ప మరొకరు కనపడరు.

కాని యేమి ప్రయోజనమూ?

కొత్త శాసన సభలలో ప్రవేశించాక—మంత్రిపదవులు స్వీకరించాక, కాంగ్రెస్సువారు, ఇలాంటి సత్యాలను ఎన్నింటిని కాళ్లతో రాసెయ్యలేదూ?

అదీ కాక:

మంత్రిపదవులకు భంగం కలిగించే సత్యాలను సహించడం అంటే కాంగ్రెస్సువారి కెప్పుడైనా సాధ్యపడే దేనా?

రంగాగారు మేలుకున్నారు మొట్టుకి

ప్రొఫెసరు రంగాగారు ఇన్నాళ్లకు ప్రకృతిలో పడ్డారు.

వారి యీ అలసత క్షమించతగ్గది కాదు; గాని వారు కనక యిప్పటి కయినా అపాయం గుర్తించగలిగారని సంతోషించవలసి వున్నది.

"రయితులు రయితు" లంటూ కబుర్లతో మాత్రమే సానుభూతి ప్రకటిస్తే కాదు, ఇలాంటి సందిగ్ధసమయాల్లో వారిని ఆదుకోగలిగితేనే రయితునాయకత్వానికి సార్థకత.

ఒకమూల పోగొట్టుకున్నా, మరొకమూల అమ్మకం వున్నా మహామ్మారిలాగ వచ్చి మీద పడిపోతూ వుంటే మద్రాసు ప్రెసిడెన్సీలో కనక సరిపోయింది కాని మరోచోట అయితే రయితు లింత బురదపాముల్లా పడి వుంటారా?

9-2-2

సాటి వర్తకులు ఆందోళనం సాగించడం చూసి అయినా గుర్తించలేకపోవడం చూస్తే మన రయితులకింతలో రాజ్యాంగసమస్యలు బోధపడతా యనుకోడానికేమయినా అవకాశా లున్నవా?

ఏవంచ :

సెలక్టు కమిటీ మెంబర్లు సవ్యంగానే వ్యవహరించినా—శాసనసభలలో వారి సూచన లెగిరిపోకుండా వుండడమే తటస్థించినా రయితు పండించే సకలవస్తువులకూ మినహాయింపు లేర్పడతాయా?

రయితు మాత్రం కొనుగోలుదార్లలో చేరకుండా వుంటాడా?

ఈ పన్నుల పేరు చెప్పి, వర్తకులు, తాము కొనేచోట ధర తగ్గించడానికీ, అమ్మేచోట హెచ్చించడానికీ తప్పకుండా ప్రయత్నిస్తా రనే సంగతి బ్రహ్మాభేద్యమయిన రహస్యమా?

నిదానించి చూస్తే యిదంతా యేమీ కాదు.

కాంగ్రెస్సుమీది అంధవిశ్వాసమే వారిని ఈస్థితికి తెచ్చి విడిచిపెట్టింది.

"ఇన్నాళ్లటి వరకూ ఉత్తరాదిన వుం"డడం నిజమే అయినా, యీసలహా యివ్వడంలో, రంగాగారు చూపించిన అలసతకు కూడా యిదే ముఖ్యకారణం అని చెప్పడాని కేమీ సంకోచం అక్కర్లేదు.

అదే కాకపోతే,

ఉత్తరాదిని వున్నన్నాళ్లూ వారికి దక్షిణాది పత్రికలు దొరకనే లేదా?

ఉత్తరాదిపత్రికలలో అయినా యీబడ్జెట్టు పన్నులకు సంబంధించిన వార్తలూ, వ్యాఖ్యానాలూ లేకపోయినవా?

ఇన్నాళ్లటివరకూ వారికీ వారి కార్యస్థానంలో పని చేస్తున్న వారికీ—వారికీ వారి అనుచరులకూ—వారికీ వారి సహకారులకూ ఉత్తరప్రత్యుత్తరాలు జరక్కుండానే వున్నాయా?

ఇంతే కాక :

ఈ విషయాలు అవగాహన కావడానికి, వారు, ఇవాళ కొత్తగా ఆర్థికసూత్రాలు అభ్యసించవలసి వచ్చిందా?

వారి స్టేటుమెంటు ఈసందేహాలు తీర్చగలిగేటంత సమర్థంగా కనపడదు.

రంగాగారి వంటి సమర్థుల నాయకత్వంవల్ల కూడా, ఆంధ్రదేశంలో "వర్గచైతన్యం" సరిగా కలగలే దనడాని కవకాశా లేర్పడడం యేమీ బాగా లేదు.

దీని కంతకీ ముఖ్యకారణం రంగాగారి కాంగ్రెస్సు వ్యామోహం వొక్కటే.

తమ ఆంధ్రజాతి ప్రత్యేకతను గుర్తించుకోకపోవడం కూడా వారిని దిగతీసేస్తున్నది.

తరుచుగా వుత్తరాదిని జరిగే వారి పర్యటనలవల్ల వారి శక్తి అంతా—వారి ప్రతిభ అంతా భావదాస్యానికి మాత్రమే దారితీస్తున్నది.

వారిని నమ్ముకుని వున్న తెనుగు రయితుల సంఖ్య పరిమితం కాదు.

ఈరయితులను వారుద్ధరించగలిగితే—ఇక్కడే కాలం అంతా గడుపుతూ, యిక్కడి పరిస్థితులను మాత్రమే గమనిస్తూ, ఇక్కడి వాడుకలు సవరించగలిగితే—తద్వారా యిక్కడి యీ తెనుగు రయితుల ఆర్ద్ర హృదయాలను ఆక్రమించుకోగలిగితే ఉత్తరాదివాళ్లే వచ్చి తమచుట్టూ తిరగడం మొదలుపెడతా రేమో వారు కొంచెం యోచించుకుంటారా?

ఇక్కడి కాంగ్రెసు మంత్రుల ప్రవృత్తి జాతీయ వికాసాని కనుకూలంగా వున్న దనే వారు భావించు కుంటున్నారా?

మేల్కోవడం వొక్కటే కనపడుతున్న దిక్కు కాని వా రేమి చెయ్యడానికీ వ్యవధి లేదు.

అంతా అనుసరించుకొని వచ్చేసిపోయింది.

క్లిష్టపరిస్థితుల్లో తమ కార్యక్షేత్రానికి దూరంగా వుండిపోయినందుకు, వారు, విచారించవలసివస్తుం దని మాత్రమే మాకు సూచనలు కనపడుతున్నాయి.

మద్రాసు రేడియో బ్రాంచి

"......ఇక ఆంధ్రభాగపు కార్యక్రమంలో విశేషంగా విన్న కంఠాలే వినవలసివస్తూ వుంది. అభిమానం యెక్కడ దుర్వినియోగ మౌతూ వుం దని చెప్పడానికే కేమీ సందేహం లేదు"

అచ్చంగా, వున్న మాటే యిది.

ఇది యింత నిష్కర్షగా చెప్పిన ప్రజామిత్రను మేము ప్రశంసిస్తున్నాము.

ఇష్టాగోష్ఠులలో యీసంగతి వుటంకరించినవా రెందరో వున్నారు.

మద్రాసు బ్రాంచి తెనుగు కార్యక్రమాన్ని నిరసించి యేవగించుకున్నవారున్నూ యెందరో వున్నారు.

మన ఆంధ్రులకు ప్రత్యేకంగా వొక బ్రాంచి నిర్మించకపోయినందుకే విచారించవలసి వుండగా— భాగం యిచ్చిన మద్రాసు బ్రాంచిలో అయినా సగం భాగం యివ్వనందుకు గర్హించవలసి వుండగా—ఇవ్వబడిన కొద్ది భాగ మయినా దుర్వినియోగం చెయ్యబడడం క్షమించడానికి వీలులేకుండా వుంది.

ఆంధ్రయువకులలో గాయకు లెందరో తయారవుతున్నారు.

ఆంధ్రయువతులలో—బాలికలలో కూడా కచేరీలు చేసి మెప్పించగల గాయనీమణు లున్నారు.

వారందరి నైపుణ్యమూ తెనుగు పత్రికలో యెప్పటి కప్పుడు సచిత్రంగా కూడా ప్రశంసించబడుతూనే వుంది.

మద్రాసుబ్రాంచిలో ఆంధ్రభాగం నిర్వహిస్తున్న వారు ఈసంగతులు తెలుసుకోడానికి వీలులేని పరిస్థితుల్లో వున్నారా?

ఇంతవరకూ జరిగించబడిన తెనుగు ప్రసంగాలలో అనేకాలు కర్తకర్మక్రియలకు కూడా వెలి అయి వున్నాయి.

ఏవేవో కొన్ని సమితులకూ, కొన్ని సమితుల అనుచరులకూ ప్రాధాన్యం యిస్తున్న సూచనలే యెక్కువగా కనపడుతున్నవి.

మహాపండితులూ, మహాకవులూ, మహా విమర్శకులూ, మహావక్తలూ, మహాదేశికులూ, ఎందరో వుండగా వారి నందర్నీ కాదని—వారి నందర్నీ ఉదాసీనంగా చూసి—వారి అనుయాయులుగా అయినా వుండడానికి అర్హతలు లేని పిల్లకాయలకు అవకాశాలివ్వడం ఆంధ్రభాషావాఙ్మయాలనూ, ఆంధ్రసంస్కృతినీ హేళన చెయ్యడం తప్ప మరేమీ కాదు.

తెనుగు దేశంలో గొప్పచిత్రకారులు వొక రిద్దరు మాత్రమే లేరు.

చిత్రవిద్యలో ప్రఖ్యాతి పొందిన యువతులు కూడా తెనుగుదేశంలో లేకపోలేదు.

వారిని కూడా మద్రాసు బ్రాంచి గుర్తించలేకపోవడం చాలా అసందర్భంగా వుంది.

తెనుగుదేశంలో హాస్యనటు లెందరో వున్నారు.

హాస్య ప్రవక్తలున్నూ వేలున్నారు.

కూచిపూడి భాగవతు లున్నారు.

గొల్లకలాపమూ, భామకలాపమూ వినిపించే కళావతు లున్నారు.

జగత్పండితు లైన హరిదాసు లున్నారు.

సూతులవారిని మరిపించే పౌరాణికు లున్నారు.

ఇంకా యెందరో—యెన్ని రకాలవారో వున్నారు.

వారిని కూడా గుర్తించకపోవడం—నిర్లక్ష్యం చెయ్యడం గర్హించవలసిందిగా వున్నది.

మద్రాసు బ్రాంచిలో ఆంధ్రభాగం ఆంధ్రులే నిర్వహిస్తున్నారా?

ప్రజామిత్ర చెప్పినట్టు "అభిమానం యెక్కడ దుర్వినియోగం" చెయ్యబడుతూ వుంటే సరిదిద్దే యేర్పాట్లేమీ లేవూ?

కాంగ్రెస్సు చరిత్రలో ఒకక్లిష్టిక కాబోయే ధర్మసందేహం

ఒక సంపన్నగృహస్థు కూతురికి పెళ్ళి అయింది.

ఉభయపక్షాలా యెక్కడెక్కణ్ణుంచో బంధువులు వచ్చారు.

ఏర్పాట్లు చాలా చక్కగానూ గొప్పగానూ జరిగాయి.

ఎదురుసన్నాహమూ, పానకపు కావిళ్ళూ మొదలైన లాంఛనా లన్నీ గుమ్మ్మగా జరిగాయి.

మూడు ముళ్ళూ పడగానే అందరి మొగాలమీదా పెళ్ళికళ జిగజిగ లాడిపోయింది.

సగం భోజనం అయినాక, రెండో నాటి రాత్రి, మొగపెళ్ళివారిలో కుర్రకారు కొందరు బూజంబంతి ప్రారంభించారు.

"తప్పా త" ప్పనీ, "వద్దు వ" ద్దనీ వెంటనే పెద్ద లందుకుని కూక లేశారు; గాని అప్పటి కప్పుడే వొక గుమ్మడికాయ ముక్క వెళ్ళి, బంతిలో చివర కూచుని వున్న వొక యువకుని విస్తట్లో బాంబులా పడింది.

అతను క్రమాంతం పూర్తి చేసినవాడు.

సనాతనధర్మి.

గోల అయింది.

నలుగురూ సద్ది చెప్పగా వొక నిమిషానికి చల్లారింది.

కన్యాదాత దగ్గిర వుండి, పక్కనే మరో విస్తరి వేయించి, క్షణంలో వడ్డన చేయించాడు.

పెళ్ళికూతురు తల్లి స్వయంగా నేతిజారీ పట్టుకువచ్చి "లేచి యిక్కడ కూచో నాయనా" అంటూ పిలిచింది.

యువకుడు వొక్కమాటు అలాగా యిలాగా చూసి, వుత్తరక్షణంలో వొక్క తప్పగంతు వేసి, కొత్త విస్తట్లో భోజనం ప్రారంభించాడు.

"కొందరపడక నింపాదిగా భోజనం చెయ్యి నాయనా" అంటూ రెట్టింపు నెయ్యి వడ్డించి పెళ్ళికూతురు తల్లి ఆడవాళ్ళ బంతిలోకి చక్కాపోయింది.

అప్పటిదాకా స్తంభించిపోయి వుండిన పెళ్ళివారు ఆత్రంతో తరవాతి కార్యక్రమం అందుకున్నారు.

ఇదిలా వుండగా——

వధువు తాత ఘనాంతస్వాధ్యాయి.

వరుడి తాత సర్వతోముఖసోమయాజి.

ఇద్దరూ భోజనం ముగించుకుని, బొజ్జలు నిమురుకుంటూ, స్వయంపాకం పందిట్లోనుంచి బ్రహ్మమహేశ్వరుల్లా చక్కావచ్చి, బంతిలో తిరుగుతూ లోటుపాట్లు కనుక్కోసాగారు.

కొంతసేపటికి వారు యువకుడి దగ్గిరికి వచ్చారు.

అతని యెదట కూచున్నవాడు పెళ్ళికొడుకు తమ్ముడు.

మంచి తార్కికుడు. సాహిత్యగ్రంథాలు చదువుతున్నా డతను.

"కొంటె కోణంగి" అని అతనికి చిన్న బిరు దున్నది.

ఉన్నట్టే వుండి, అతను "ముందు తాతగా రిద్దరికీ నమస్కారా" లన్నాడు. "తరవాత వొక విన్నపమున్నా" అన్నాడు.

బంతి అంతా స్తబ్ధం కాగా, వృద్ధు లిద్దరూ సావధాను లైనారు.

తార్కికుడు ముందు జరిగిందంతా చెప్పి "మా బావ ఉత్తరాపోశనం పట్టకుండా పాత విస్తరి విడిచిపెట్టాడు. పరిషేచన చెయ్యకుండా, ఆ యెంగిలి చేత్తోటే, కొత్త విస్తట్లో భోజనం చేస్తున్నాడు. ఇప్పు డతనికి భోజనాధికారం వున్నదా? అతను చేసేది భోజనమే అని చెప్పవచ్చా?" అని అడిగి గంభీరంగా చూశాడు.

ఈమాటు వృద్ధులు స్తబ్ధు లయిపోయారు.

బంతి అంతా గొల్లుమంది.

అప్పటి కప్పుడే భోజనా లయిపోవడం చూసి, ఇక తా మక్కడ వుండవలసిన పని లేదన్నట్టు నటిస్తూ వృద్ధు లిద్దరూ చల్లగా జారుకున్నారు.

కుర్రకారులో తార్కికుడి పక్షం కొందరూ, అది చూసి జాలిపడి యువకుడి పక్షం కొందరూ జయజయధ్వనులు చేస్తూ బిలబిల్లాడుతూ దొడ్లోకి చక్కాపోయారు.

దాంతో కొంచెం బింకం తెచ్చుకుని, తాపీగా లేచి, యువకుడు, తార్కికుణ్ణి వుద్దేశించి "పోస్! నాకంటే యెక్కువ తెలుసా యేమిటి వీడికి? పెద్దలు నాపక్షంగానే వున్నారు" అనుకుంటూ మెల్లిగా వెళ్ళిపోయాడు.

కలకత్తా ఏ. ఐ. సీ. సీలో, అధ్యక్షుడి రాజీనామాను పురస్కరించుకుని, నారిమన్‌గా రడిగిన ప్రశ్న చూశాటప్పటికి గభీ మని మా కీ చిన్ననాటి వుదంతం జ్ఞాపకం వచ్చింది.

కలకత్తా ఏ. ఐ. సీ. సీ. పర్యవసానం యిదీ

కలకత్తా సమావేశానికి పటేలుగారిని రావద్దనడంలో గాంధిగారు కనపరిచిన దూరదృష్టి ప్రశంసాపాత్రంగానే వున్నది.

ఏమంటే!

పటేలుగారే వచ్చి వుంటే, నిజంగా, లాఠీఛార్జీలూ, తుపాకీకాల్పులూ జరిగి వుండేవి.

ఇప్పుడు రాళ్లూ, చెప్పులూ యెగరడంతో మాత్రమే సరిపోయింది.

ఈలాభం యిలా వుండగా, వారు రాకపోవడంవల్ల, జరగవలసిన లాభాని కేమీ లోటు కూడా రాలేదు.

విశేషించి, అది, కావలసినంతకంటే యెక్కువగానే జరిగింది.

ఆవిషయమై నెహ్రూగారు చాలా శ్రద్ధ పుచ్చుకున్నారు.

ఎంత చాకచక్యమూ నెహ్రూగారిదీ?

త్రిపురిలో "ఎంత చక్కని జట్టు వెంటపెట్టుకు వచ్చావయ్యా" అని శరచ్చంద్రబోసుగారిని వెటకారం చేసిన నెహ్రూగారు కలకత్తాలో యెంత కౌటిల్యం చూపించారూ?

అయితే, యిది గాంధిగారికి తెలవంది కాదు.

వారికి అక్కర్లేనిదిన్నీ కాదు.

కొద్ది కాలభేదంతో, గాంధిగారూ, నెహ్రూగారూ యీసందర్భంలో యేకఫలాపేక్షు లయి వున్నారు.

ఇద్దరూ బోసుగారి పతనమే ఆకాంక్షిస్తూ వున్నారు.

తెలుసుకో గలిగితే, బోసుగారు, గాంధిగారిని విదలించి కొట్టి, అధ్యక్షతకు సంబంధించిన పోటీకి, రెండోమాటు సిద్ధపడ్డప్పుడే నెహ్రూగారి స్వార్థచింత రూపొంది వుండడం స్పష్టపడుతుంది.

తరవాత బలపడి, ధృవపడి, అది, త్రిపురిలో స్పష్టంగానే వ్యాధగీతం పాడింది.

సరి, కలకత్తాలో అది గజ్జెకట్టి విలయతాండవమే చేసింది.

సుభాసుబోసుగారు తమ రాజీనామాను ఉపసంహరించుకోవలసిం దనీ, ప్రాత కార్యసంఘసభ్యులనే క్రొత్త కార్యసంఘసభ్యులుగా నియమించా లనీ అఖిల భారత కాంగ్రెస్సుసంఘం తీర్మానిస్తున్నది" అని కదా నెహ్రూగారి తీర్మానం?

పంతుగారి త్రిపురీ తీర్మానంలో కంటే దీల్లో వున్న సౌజన్యం యేమిటీ?

గాంధిగారి ఆర్డరులో కంటే దీల్లో నిర్బంధం యేమి తక్కువగా వున్నదీ?

గాంధి బోసుగార్లకు సామరస్యం కలిగించడానికి నెహ్రూగారు చూపించిన తాటస్థ్యమున్నూ యేమిటీ?

పాత వర్కింగు కమిటీని తూర్పారబట్టిన నెహ్రూగారు, మళ్లీ ఆకమిటీలోనివారినే కట్టుకో మని బోసుగారికి చక్కట్లు దిద్దడంలో యేమి ఔచిత్యం వున్నదీ?

తాము బోసుగారికి సూచించినవారితోనే రాజేంద్రప్రసాదుగారు వర్కింగు కమిటీ నిర్మించారే, అందులో చేరడానికి నెహ్రూగా రెందుకు నిరాకరించారూ?

ఎటు చూసినా బోసుగారిని పుల్లాసీదా చేసెయ్యడమే నెహ్రూగారి స్థిరసంకల్పం అని తేలుతున్నది.

నిజం చెప్పవలసివస్తే, పటేలుగారిలాగ నెహ్రూగారు కూడా కలకత్తా వచ్చివుండకపోతే కాంగ్రెస్సు బతుకు ఇలాగ బగ్గంపాడు కాకుండా వుండేది.

నెహ్రూగారు వచ్చి వుండకేపోతే గాంధిగారి బింకం తప్పకుండా సడలిపోయి వుండేది.

నెహ్రూగారే వచ్చి వుండకపోతే బోసుగారి రాజీనామా జరిగి వుండేదే కాదు.

బోసుగారి విషయంలో, నెహ్రూగారు, పటేలుగారి కంటే తక్కువ తలిచిందీ, తక్కువ చేసిందీ యేమీ లేదు.

అయితే, బోసుగారిని పడగొట్టడానికి నెహ్రూగారిని ప్రోద్బలపరిచిన కారణా లేవో వాటికి పటేలుగారివల్ల అపాయం కలగదా అంటే యెంతమాత్రమూ కలగదు.

ఏమంటే?

గాంధిగారున్నంతసేపే పటేలుగారికి కాంగ్రెస్సులో పలుకుబడి.

గాంధిగారున్నంతసేపే పటేలుగారికి అఖిలభారతీయతలో నామరూపాలు.

గాంధిగారున్నంతసేపే పటేలుగారికి కాంగ్రెస్సులో "రంకు పొండు" లు.

తరవాత తమ గుజరాతీ దేశంలో అయినా, వారు, తమ ప్రాజాపత్యం నిలుపుకోగలరో లేరో?

నెహ్రూగారి సంగతి అలాంటిది కాదు.

ఇవాళే, వారు, గాంధిగారి తరవాత అఖిలభారతీయతలో అంతటి ప్రాముఖ్యం కలవారై వున్నారు.

గాంధిగారి అనంతరం వారు ప్రధాననాయకత్వానికే పట్టభద్రులు కావచ్చు.

దేశీయుల దృష్టిలో ఇవాళే వారికి అనంతరవారసత్వం స్థిరపడి వున్నది.

కాగా, ఈవిషయంలో నెహ్రూగారికి, పటేలుగారితో పేచీ యేమీ లేదు.

రాజేంద్రప్రసాదు, గఫర్ ఖాన్, రాజగోపాలాచారిగార్లు కూడా నెహ్రూగారికి ప్రతిస్పర్థులు కావడానికి చాలలేరు.

పోగా, ఇక నెహ్రూగారితో సరిగా లెక్కపెట్టతగ్గవా రిప్పటికి బోసుగారొక్కరే.

ఇంతే కాదు.

యువజనోచితాలైన ధైర్యసాహసాలలోనూ, వెనకతీత యెరగని త్యాగంలోనూ, ఉన్నతవిద్యలోనూ, ప్రతిభలోనూ, దేశాభిమానంలోనూ, దేశసేవలోనూ, కార్యవాదంలోనూ, కార్యనిర్వహణంలోనూ, ఏకాగ్రతలోనూ నెహ్రూగారికంటే బోసుగారే కొంతకు కొంత అధికు లని నిరాఘాటంగా చెప్పవచ్చు.

పదవులకోసం నమ్మిన సిద్ధాంతాలు మరిచిపోని శీలంలో కూడా బోసుగారి ఆధిక్యం విస్పష్టంగానే వున్నది.

చిరకాలకారాగృహనివాసమూ, దీర్ఘవ్యాధులూ, కాలనిర్ణయం లేకుండా ఖండాంతరాలలో పడివుండవలసిరావడమూ—ఇలాంటి అనివార్యహేతువులవల్ల, భరతఖండం అంతా దభాదభాలు చుట్టి రాలేకపోయారే; గాని, అనేకకాంగ్రెస్సు సమావేశాలలో పాల్గొనలేకపోయారే; గాని, అభమూ శుభమూ యెరగని అనుచరులను గుంపులుగుంపులుగా తయారు చేసుకోలేకపోయారే; గాని, బోసుగారు, నెహ్రూగారికంటే సర్వాత్మనా అధికులనడానికేమీ సంకోచం అక్కరలేదు.

నెహ్రూగారు మూడు మాట్లు కాంగ్రెసు అధ్యక్షులయినా రంటే దానికి కారణం వొకటి, తండ్రిగారి పలుకుబడి, రెండు, గాంధిగారి నాశ్రయించి వారిచేత ఆశీదులు రాయించుకోవడం, మూడు, తాము నమ్మిన సిద్ధాంతాలు జారబెట్టడం.

బోసుగారు రెండు మాట్లే అధ్యక్షులు కాగలిగినా, దానికి వుండిన కారణాలు వీరోచితాలు.

ఒకటి, గాంధిగారికి, మొదటిమాటు బోసుగారిని నియోగించక తప్పనిసరి కావడం, రెండు, రెండో మాటు, బోసుగారికి "నువ్వా నేనా?" అని గాంధిగారిని ఎదిరించి నిలవగల సత్తా యేర్పడి వుండడం.

అయితే, అంతటి వారికి కలకత్తాలో యీ అపజయం యేమిటీ అంటే మంచంమీద పడి వుండగా త్రిపురిలోనే దానికి కారణా లేర్పడడం.

కలకత్తా వచ్చాటప్పటి కది ఘనీభవించిపోయి వుండి—పైగా నెహ్రూగారి శల్యసారథ్యం సంభవించడం.

అయితే,

ఇంతమాత్రాన బోసుగారు మరి లేవలే రనుకోవడం అజ్ఞానం.

కలకత్తా వన్ని వేళం హృదయం వున్న ప్రతివారికీ వారియెడల అనుకంప కలిగించింది.

పైగా, గాంధిగారిని నమ్మి—అందువల్లనే చెడిపోయిన నారిమన్ ఖరే మొదలైనవారి సానుభూతి వారియెడల పుష్కలంగా వున్నది.

సహజమైన సత్తాకు సాయం, వారికి, సమర్థులైన సోదర్ల అండ వున్నది.

సుశిక్షితమూ, సునిశితమూ, విజ్ఞానమహితమూ, ప్రపంచప్రసిద్ధమూ అయిన స్వజాతి ఆసరా వున్నది.

మృత్యువును కూడా ప్రతిఘటించి జయించేసిన పట్టుదల వున్నది.

కనక, ముందుముందు, నెహ్రూగారికీ బోసుగారికీ మాత్రమే కాంగ్రెస్సులో అగ్రపీఠం.

తన్మూలంగా నెహ్రూగారికీ బోసుగారికీ మాత్రమే పోటీ.

తప్పనిసరిగా నెహ్రూగారికీ బోసుగారికీ మాత్రమే ప్రతిస్పర్థ.

అంచేతే నెహ్రూగారి యీ ప్రయత్నం.

కాని బోసుగారి కీ దృష్టి లేదు.

ఇప్పటి కింకా వారి హృదయాలలో స్వార్థపరాయణత అంకురించలేదు.

తాము నమ్మిన సిద్ధాంతాల ననుసరించి దేశసేవ చెయ్యడంలో—నిష్కామంగా తమ సర్వస్వమూ దేశం కోసం ధారపొయ్యడంలో అడ్డు తగులుతున్న గాంధి తత్వాన్ని అదుపాజ్ఞల్లో వుంచడానికి బోసుగారు తంటాలుపడుతుండగా—తాము నమ్మిన సిద్ధాంతాలనే అనుసరిస్తున్న—స్వధర్మచ్యుతి యెరగని పెద్దమనిషిని, ముందుముందు తమకు అడ్డు రాకుండా వుండేటట్టు చేసుకోడానికే నెహ్రూగారు చదరంగం యెత్తులు నడుపుతున్నారు.

ఇదీ భేదం.

ఇదీ తారతమ్యం.

ఇదీ వున్న రహస్యం.

కాని, దేశం, ఇవాళ యిదంతా గ్రహించగల స్థితిలో లేదు.

విడమర్చి చెప్పినా బోధపరుచుకోగల స్థితిలో కూడా లేదు.

కాని, యిదంతా ప్రసక్తానుప్రసక్తం.

ఇక చెప్పవచ్చిం దేమిటంటే?

ఇవాళ,

బోసుగారు, భౌతికంగా పడిపోయారు.

గాంధిగారు, నైతికంగా కూలే పోయారు.

కలకత్తా ఏ.ఐ.సీ.సీ. పర్యవసానం యిదీ.

గుంటూరి ప్రయత్నాలు

గుంటూరిలో యేదో విధంగా, ఆంధ్రమహాసభ జరిగేటట్టు కనపడుతున్నది.

స్థాయిసంఘంవా రనుజ్ఞ యిచ్చారు; కనక యిది జరుగుతుం దనే నమ్మవచ్చు.

ఆంధ్రోద్యమజనకుల్లో వొక రయి వుండీ, మొదటి ఆంధ్రమహాసభను జేగీయమానంగా జరిపించి వుండీ, అయిదో ఆంధ్రమహాసభ వచ్చేటప్పటికి అధ్యక్షత వహించగలిగిన వేంకటప్పయ్యపంతులుగారు పూనుకోవడంవల్లకూడా యీసంగతి నిక్కచ్చిగా చెప్పవచ్చు.

బాగానే వున్నది.

బెజవాడలో డా. పట్టాభిగారు చుక్కాని తిప్పారు.

మద్రాసులో సాంబమూర్తిగారు ఆధ్వర్యం వహించారు.

ఇక గుంటూరిలో వేంకటప్పయ్య పంతులుగారు సారథ్యం నెరవేరుస్తారు.

ఇలాగ, కాంగ్రెస్సాంధ్రులలో ప్రముఖు లయి వుండిన యీ ముగ్గురికీ, వరాసగా, వంతులు తీరిపోవడం ముచ్చటగానే వున్నది.

చాలా సంతోషం.

అయితే,

మరి ప్రయోజనం?

ఆంధ్రరాష్ట్రం అంటే యిప్పట్లో ఆంధ్రులకు ప్రత్యేక స్వారాజ్యం వంటి దని వీరికి నమ్మకం వున్నదా?

అది మనఆంధ్రులకు మొట్టమొదటి జాతీయ వాంఛితం అని వీరు గమనించగలుగుతున్నారా?

ఆంధ్రరాష్ట్రం కావా లనడంలో, వీరికి, నిజమైన చిత్తశుద్ధీ, ఆవేదనా వున్నవా?

దీక్షా, ఏకాగ్రతా వుంటే గాని అది సాధ్యం కా దని చెబితే వీరు అంగీకరిస్తారా?

అలా అయితే,

తాము, ఆంధ్రోద్యమం కంటే పవిత్రమైన దని కాంగ్రెస్సుద్యమంలో చేరారు గదా?

కాంగ్రెస్సు భాషైకరాష్ట్రసిద్ధాంతం అంగీకరించిందనీ, ఆచరణలోనే పెట్టి వున్నదనీ, ఎప్పటికయినా ఆంధ్రరాష్ట్రం కాంగ్రెస్సు ద్వారానే వస్తుందనీ తామే ంటున్నారు గదా?

ప్రస్తుతం కాంగ్రెస్సు మంత్రివర్గమే అమల్లో వుంది కదా?

కోరి తీసుకువచ్చి, రాజగోపాలాచారిగారిని, ఆంధ్రులే ప్రధానమంత్రిపదవికి అభిషేకించారు గదా?

మద్రాసు మంత్రివర్గం, మద్రాసు ప్రెసిడెన్సీవిభజన తీర్మానం అంగీకరించి, బ్రిటిషు గవర్నమెంటుకి రాసే వున్నది గదా?

నాలుగు రాష్ట్రాలలోనూ ముందు విడతియ్యతగ్గది ఆంధ్రరాష్ట్రం మాత్రమే అని రాజగోపాలాచారిగారు చాలా ఘాటుగా రాసి వుండడమే కాకుండా, ఇండియా శక్రటరీని ఇంకా నిక్కచ్చి చేస్తూనే వున్నారు గదా?

కాంగ్రెస్సు అంటే బ్రిటిషువారికి గుండెలు పీచుపీచుమంటూ వుంటా యని తాము చెప్పే మాటే కదా?

కాంగ్రెస్సు వర్కింగు కమిటీ కూడా ఆంధ్రరాష్ట్రప్రయత్నాలకు అడ్డు తగల దని తాము నమ్ముతూనే వున్నారు గదా?

ఆంధ్రరాష్ట్రీయకాంగ్రెస్సు సంఘం తమ చేతిలోనే వున్నది గదా?

అదే సమావేశపరిచి, దాని ద్వారానే ప్రయత్నాలు చెయ్యక, మరి యీ ప్రముఖులు ఆంధ్రరాష్ట్రం కోసం, మధ్యమధ్య నిద్రలో వులిక్కిపడ్డట్టు, వుండుండి ఆంధ్రమహాసభ అయిం దనిపిస్తూ వుంటా రెందుకూ?

కాంగ్రెస్సు కార్యప్రణాళికలో ఆంధ్రరాష్ట్రం విషయం చేర్చడానికి నియంతలు వొప్పుకోరా?

ఆంధ్రమహాసభను తమ గుప్పిట్లో యిరికించుకూడోడం, కాంగ్రెస్సేతర్ల కందులో ప్రవేశం లేకుండా చెయ్యడాని కేనా?

దీన్ని బట్టి చూస్తే, ఆంధ్రైకీకరణం విషయమై వీరికి గల వుద్దేశా లెంత సంకుచితాలో, వీరికి భావస్వాతంత్ర్యం యేమాత్రం వున్నదో, వీరి వ్యవహారసరళిన్నీ యెంత సక్రమ మయినదో బోధపడుతుంది.

కాంగ్రెస్సన్నా ఆంధ్రమహాసభ అన్నా, స్వరాజ్యం అన్నా ఆంధ్రరాష్ట్రం అన్నా వీరికి నిష్కృష్టాలైన అభిప్రాయాలు లేవని కూడా స్పష్టపడుతున్నది.

"ఆంధ్రరాష్ట్రమా, స్వరాజ్యమా, ముందు" అనే సమస్య, వీరి కింకా తేలలే దని కూడా వెల్లడి అవుతున్నది.

ఒకరు చెప్పింది చెయ్యడమే గాని స్వయంగా కార్యక్రమం నిర్ణయించుకుని ప్రస్థానం సాగించే నేరు కూడా వీరి కున్నట్టు కనపడదు.

కాంగ్రెస్సు సంబంధం వొదులుకోనంత కాలం వీరు ఆంధ్రరాష్ట్రం విషయమై యెలాంటి ప్రయత్నాలు చేసినా అవి విఫలాలు కాకతప్పదు.

కాంగ్రెస్సాంధ్రుల ఆంధ్రమహాసభా నిర్వాహణంవల్ల యేమయినా ప్రయోజనం కలిగే అదృష్టం వుండే వుంటే, అది, బెజవాడ మదరాసు సభలవల్లనే అయి వుండేది.

వేంకటప్పయ్యపంతులుగారి యీగుంటూరి ప్రయత్నాలు నెరవేరడమే సంభవిస్తే, అవి, సుభాసుబోసుగారిని పడగొట్టిన గాంధిగారికి ప్రశంసలు నివేదించడానికి తప్ప మరొకందు కుపకరించవు.

ఆంధ్రరాష్ట్రం యింతట్లో రాదు

కొందరి మనస్సు కీమాట చురుక్కు మనిపిస్తుంది.

నిజమే.

కాని యేంటి చెయ్యడం?

ఎవ రేమన్నా యిది యిలాగే జరుగుతుంది.

మన ఆంధ్రుల కిది స్వయంకృతాపరాధం.

ఎప్పటి కయినా యీదుర్యోగం తప్పిపోవా లంటే యిప్పటి కీ చేదు అనుభవించడం వొక్కటే వుపాయం.

ముందుముం దయినా ఆంధ్రరాష్ట్రం రావా లంటే— దానికి తగిన కార్యక్రమం యేర్పడి, నికరమైన పని జరగడం చాలా అవసరం.

నికర మైన పని అంటే మ రేమీా లేదు.

నికర మైన పని అంటే, ఆంధ్రు లైనవా రందరూ వెంటనే కాంగ్రెస్సును విడిచిపెట్టెయ్యడం.

నికర మైన పని అంటే, ఆంధ్ర దేశంలో గుజరాతీల కాంగ్రెస్సుకి యేమాత్రమూ ఆస్కారం లేకుండా చెయ్యడం.

ఎంచేతనంటే ?

ఆంధ్రజాతికి—ఆంధ్రవిజ్ఞానానికి—ఆంధ్రకళలకు— ఆంధ్రపరిశ్రమలకు — ఆంధ్రుల ఆత్మగౌరవానికి — ఆంధ్రుల సర్వస్వానికీ కాంగ్రెస్సు కాళరాత్రి అయి పోయివున్నది.

ఆంధ్రోద్యమజనకులు—ఆంధ్రోద్యమనిర్వాహకులు— ఆంధ్రజాతీయనిర్మాతలు అయినవారినీ — అవుతున్న వారినీ — కాబోయేవారినీ కాంగ్రెస్సు తప్పుదారికి లాగేసింది.

కాంగ్రెస్సు మెరుగులకు మోసపోయి, వారు తమ్మ తామే మరిచిపోయారు.

కాంగ్రెస్సు మెరుగులకు ముగ్ధు లయిపోయి, ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని, వారు, నడిసముద్రంలో ముంచేశారు.

ఇంతకంటే మనకు కాంగ్రెస్సు చేసిన అపకారానికి మరొక నిదర్శనం ఏమి కావాలీ ?

ఇప్పుడునూ్నా కాంగ్రెస్సు మనల్ని వంచిస్తూనే వున్నది.

మద్రాసు శాసనసభలలో జరిగి వుండిన—జరుగుతూ వున్న కార్యక్రమం సరిగానే వుందనీ, శాస్త్రీయంగానే వుందనీ, అందులో కిటు కేమీా లేదని యెవ రైనా చెప్పగలరా ?

మద్రాసు కాంగ్రెస్సుమంత్రివర్గం ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయమై ఇండియామంత్రికి రిమైండరు మీాద రిమైండరు పంపుతూనే వున్నదే, ఆంధ్రమహాసభాధ్య క్షులు మాత్రమే కాక—జగత్పండితులే కాక కార్య నిర్వహణాప్రవీణులుకూడా అయిన సర్. రాధాకృష్ణయ్యగారు లండనులోనే మకాం పెట్టి వున్నారే, వారు జట్లండు ప్రభువుకి మిత్రులు కూడా నటే, మరి "యిప్పుడు కా" దని జవాబెందుకు వచ్చిందీ ?

కారణం, కాంగ్రెస్సు చేస్తూ వున్న నయవంచన.

ఇటు మద్రాసు మంత్రులు విభజనతీర్మానం చేసి ఇంగ్లాండు పంపడమూ ;

అటు వర్కింగు కమిటీ "ఇప్పుడు కా" దని తిరస్కరించడమూ ?

ఇవతల సీమకి రాయబారం వెళ్ళా లంటే కాంగ్రె స్సేతర్లకు సత్తా చాలకపోవడమూ ?

అవతల, సాంబమూర్తిగారు బయలుదేరితే కసిరి కూచోబెట్టడమూ ?

దీనికి సాయం, సాంబమూర్తిగారిని ఆంధ్రరాష్ట్రం విషయమై సమగ్రమైన వివరణతో వొక గ్రంథం రాయ మని బహిరంగంగా ఆజ్ఞాపించి, లోపాయికారీగా "వల్లకా" దని గద్దించడమూ ?

ఇది వంచన కాదూ ?

ఇది బ్రిటిషువారికి తెలవదూ ?

ఇది బ్రిటిషువారికి "ఆంధ్రరాష్ట్రం విషయం యిప్పు డెత్తుకోవ" ద్దని చెప్పడం కాదూ ?

ఇది "మద్రాసు శాసనసభల తీర్మానం శాస్త్రీయం కాదు. దాన్ని బట్టి రాష్ట్రవిభజనకు మీారెలా పూనుకుంటారూ ?" అని మొదు రడగడం కాదూ ?

ఇంతకంటే నయవంచన యేమి కావాల ;

ఇలాంటి సందర్భంలో కూడా ఆంధ్రులు "యీాపని కాంగ్రెస్సువల్లనే అవుతుం" దనుకోవడం శుద్ధ అవివేకం కాదూ ?

ఎదురొమ్ము మీాది కుంపటి లా వున్న కాంగ్రెస్సు సంగతి అలా వుంచి యిక బ్రిటిషువారి సంగతి కొంచెం చూద్దాం.

ఇప్పుడు మనవాళ్ళ ఆలోచనలో వున్న గొప్ప కార్య క్రమం సీమకి రాయబారం వెళ్ళడం.

కాని, పరిశీలించి చూస్తే, యీా ఆలోచన చేస్తున్న వారి వ్యవహారజ్ఞానం శాస్త్రీయంగా కనపడదు.

రాధాకృష్ణయ్య పంతులుగారు, లండను వెళ్ళి ఇండియా మంత్రితో మాట్లాడా రంటే అది రాయబారం వెళ్ళడం కాదూ?

అది సాధికార మైన ఆంధ్రుల రాయబారం కాదూ?

రెండో రౌండు టేబిలు సభకు వెళ్ళిన గాంధిగారిని "భరతఖండాని కంతటికీ యేకైక ప్రతినిధి" అన్నారే కాంగ్రెస్సువారు?

అదే పద్ధతిలో, ఇప్పుడు రాధాకృష్ణయ్యపంతులు గారు "ఆంధ్రదేశాని కంతటికీ యేకైక ప్రతినిధి" కారూ?

ఇంకా వారు లండనులోనే వుండగా, యిప్పుడు మళ్ళీ మరొక రాయబారం పంపడం అంటే రాధాకృష్ణయ్య పంతులుగారిని తీసిపారెయ్యడం కాదూ?

రాధాకృష్ణయ్యపంతులుగారితో "ఇప్పుడు కా" దన్న బ్రిటిషువారు, మరో రాయబారవర్గం మాట విని వెంటనే ఆంధ్రరాష్ట్రం నిర్మించేస్తారా?

"దశ పూర్వేషాం దశాపరేషాం" అన్నట్టు, వెనకా ముందూ కొన్ని సంవత్సరాల పరిస్థితులు ఆలోచించకుండా బ్రిటిషువారు చటుక్కున మాట అనేస్తా రనుకునేవారు రాజకార్యాలలో కలగచేసుకోడాని కర్హులేనా?

ఇలా చేస్తే రాధాకృష్ణయ్యపంతులుగారిమీదా, ఆంధ్రజాతిమీదా బ్రిటిషువారికి సదభిప్రాయం వుంటుందా?

కాకపోయినా,

రాయబారం వెళ్ళడానికి రాధాకృష్ణయ్యపంతులు గారికంటే అలౌకికార్హతలు కలవారు మరెవరున్నారూ?

ఉండినా, పంతులుగారి రాయబారానికి ప్రేరకాలైన పరిస్థితుల్లో కంటే, ఇప్పటి పరిస్థితుల్లో వున్న అసాధారణత యేమిటీ?

ఏతావతా

ఏదియే మయినా సరే, యిప్పుడు రాయబారం వెళ్ళే తీరా లంటే,

కాంగ్రెస్సాంధ్రులు వెళ్ళరు.

వెళ్ళరు కాదు, వెళ్ళలేరు.

వెడితేన కాదు, వెడతా నంటే కూడా వారిని, కాంగ్రెస్సు, అమాంతంగా అణిచేస్తుంది.

కాగా, కాంగ్రెస్సాంధ్రులు ఆంధ్రరాష్ట్రం కోసం సీమకి రాయబారం వెళ్ళడం యెన్నడూ సంభవించదు.

కనక, వారి సంగతి అలా వుండనిచ్చి కాంగ్రెస్సేతర్లను పంపుతారా?

నిష్ప్రయోజనం.

వో—ట్టి దండుగ.

అయినా సరే అన్నా, అదిన్నీ నెరవేరదు.

రాధాకృష్ణయ్యపంతులుగారి మాట యేమిటో మేము చెప్పలేము; గాని కాంగ్రెస్సేతర్లలో ప్రపంచధోరణి యెరిగున్నవా రెవరూ అందుకు సిద్ధపడలేరు.

బ్రిటిషువారు కాంగ్రెస్సేతర్ల మాట యెంతమాత్రమూ లెక్క చెయ్యరు.

అసలు, వినిపించుకోనే వినిపించుకోరు.

కారణం, కాంగ్రెస్సేతర్లు, ఆంధ్రదేశంలో ప్రజాప్రతినిధులు కాకపోవడమే.

వ్యక్త్యపేక్షయా బ్రిటిషువా రెవరితోటేనా మాట్లాడతారు.

ఏం చెప్పినా విని, యేమయినా చేస్తారు.

కాని రాచకార్యా లనేటప్పటికి వారు ప్రాతినిధ్య సూత్రాలు స్మరిస్తారు.

బ్రిటిషువారిలో లిబరల్సు గాని, లేబరర్సు గాని రాజకీయంగా యేమయినా వాగ్దానాలు చేస్తే మన మయినా వాటికి విలువ యిస్తామా?

ఇలాంటి స్థితిలో, తామే నిబంధించిన రాజ్యాంగ సూత్రాల ననుసరించి ప్రజాప్రతినిధులై పరిపాలన చేస్తున్న కాంగ్రెస్సాంధ్రులు దూరంగా వుండగా, ఎన్నికల్లో వోడిపోయినవారు—లేక—కలగజేసుకోనివారు వెళ్ళి యేదో చెబితే బ్రిటిషువారు, వారు అడిగింది చేసేస్తా రని అనుకోవడం బుద్ధిమంతుల లక్షణ మేనా?

ఇంతకీ:

మనం ఫెడరేషనుమాట మరిచిపోగూడదు.

బ్రిటిషువారు ఫెడరేషను అమలుచెయ్యదలచిన రోజు దగ్గిర పడుతున్నది.

చివరి కది "తూ చా" లు తప్పకుండానే అమలు జరిగిపోతుంది గాని, ప్రస్తుతం, వ్యవహారం కొంచెం యెటూ ముటీగా కనపడుతున్నది.

అంచేత బ్రిటిషువా రిప్పుడు మరొక్క ప్రార్థనకు చెవి యివ్వరు.

ఆంధ్రరాష్ట్రం యీలోపున నిర్మించడాని కూడా వీల్లుండడం కాదు ప్రధానం, బ్రిటిషువారి కది ప్రధాన సమస్యగా కనపడాలి.

వారికి, అది వాయిదా వెయ్యడానికి వీలులేని ద, దృఢంగా నాటాలి.

పరిస్థితులు విషమిస్తా యని తోస్తేనే బ్రిటిషువారు ఏమార్పు చెయ్యడాని కయినా పూనుకుంటారు.

సొంత విషయాలలో కూడా వారు తాపీగానే వ్యవహారించడం చరిత్రసిద్ధమే గదా?

ఇది యిలా వుండగా,—

ఇవాళ యూరపుఖండం కుతకుత వుడికిపోతున్నది.

అక్కడి ప్రతీదేశంలోనూ భోజనపదార్థాలకంటే యెక్కువగా ఆయుధాలు సమీకరించబడుతున్నవి.

యుద్ధమేఘాలు కమ్ముస్తున్నవి.

సేనలు మొగ్గరాలు తీరుతున్నవి.

పాలకు లొకరి నొకరు ఛెడామడా యెత్తిపొడుచుకుంటున్నారు.

ఏక్షణాలో ప్రపంచయుద్ధం ప్రారంభమే అయిం దేమో అన్నంత హడలుగా వున్నది వ్యవహారం.

దీనికి తోడు, యూరపులో బ్రిటిషువా రంటే పెద్ద లెక్కల్లో జమ.

ప్రపంచం అంతటా బ్రిటిషువారి బాధ్యత, తక్కిన యేవొక్క దేశంవారి బాధ్యతకంటేనూ యెన్నోరెట్లు ంగా వున్నది.

నిజంగా, బ్రిటిషువారు పూనుకుంటే, ప్రపంచం, పసన్నగంభీర మైన పూలతోటా అవుతుంది, సర్వనాశం ర మైన అగ్నిహోత్రప్పుంతా అవుతుంది.

చెప్పవచ్చిం దేమి టంటే?

ఇటు ఫెడరేషను.

అటు అంతర్జాతీయకల్లోలం.

చిరసంచిత మైన బ్రిటిషువారి రాజ్యతంత్రప్రావీణ్యాని కివి రెండూ వొరపిడిరాళ్లు.

వీటి యెదట, బ్రిటిషువారి దృష్టిలో ఆంధ్రరాష్ట్రసమస్య యేపాటిదీ?

"ఇప్పుడు కా" దని కాంగ్రెసు వర్కింగు కమిటీ యిచ్చిన భరవసాకు తోడు పరిస్థితులున్నూ యిలాగ క్లిష్టాతిక్లిష్టా లయి వున్నపుడు బ్రిటిషువారు ఆంధ్ర రాష్ట్రనిర్మాణానికి పూనుకోవడం సంభవమేనా?

మన ప్రధానమంత్రి రాజగోపాలాచారిగారు, ఇండియామంత్రితో యింకా యింకా ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం ప్రశాంత మయి వుండిన అనుకూలసమయం తప్పించి, ఆంధ్రరాష్ట్రసమస్యను తుపానులో తగుల్కునేటట్టు చెయ్యడానికే వుపకరించిం దన్న సంగతి గుర్తించలేని కాంగ్రెసాంధ్రులు ఏమి చెబితే మాత్రం యేమి లాభమూ?

కాగా,

ఇవన్నీ వూసిపోని ఆలోచనలు.

వ్యర్థప్రయత్నాలు.

కాలమూ, ధనమూ, శక్తీ, దీక్షా వమ్మయిపోవడమే గాని దీనివల్ల మరేమీ లాభం వుండదు.

ఏమి చేసినా ఆంధ్రరాష్ట్రం యింతట్లో రాదు.

రాష్ట్రం సంపాదించే మొనగాడితనమే మనవారిలో కనపడ్డం లేదు.

చేతనైతే గుజరాతీల కాంగ్రెస్సును తెనుగుదేశం సరిహద్దులు దాటించండి.

అదీ ఆంధ్రరాష్ట్రం సంపాదించే మొదటి యోగ్యత.

కాఠిన్యం లేనిదీ వొక జీవితమేనా?

"అప్రతిమాన మైన తన జీవితంలో మహాత్ముడు ఒక్క పర్యాయం కొంచెం కఠినంగా సంచరించా డని చెప్ప సాహసిస్తున్నాము"

బోసుగారి రాజీనామానుగురించి రాసూ (౧-౫-౩౯) ఆంధ్రపత్రిక యిలా అంటున్నది.

గాంధిగారిల కాక, వారి అహింసాసిద్ధాంతం, యిలాగ తిదనుయాయుల్లో అయినా జీర్ణించడం బాగానే వున్నది.

అయితే, కాంగ్రెస్సువంటి వొకానొక పెద్ద రాజకీయ పక్షం నడుపుతున్న నాయకుడి జీవితంలో వొక్క పర్యాయమే—కొంచెమే కాఠిన్యం కనపడ్డ దనడం ఆ నాయకుణ్ణి తెగడ్డమే కాని పొగడ్డం కాదు.

నిజంగా, వుద్యమాలు నడిపే నాయకులకూ, ప్రజలను పాలించే రాజులకూ, చివరికి మతప్రవక్తలకూ కూడా కాఠిన్యం వుండితీరవలసిన యోగ్యత.

కాఠిన్యం వున్నచోటనే స్వధర్మనిష్ఠ వుంటుంది

ఎవరి హృదయాలు వజ్రకఠినాలు కావో వారు ఏమీ చెయ్యలేరు.

ఒక్క సీతకోసం రాముడు రాక్షసకులం నాశనం చేశాడు.

అది మృదుత్వమా ?

అసంఖ్యప్రజానీకంలో ఆవగింజలనూ పోలని పాండవులకు దాయభాగం దక్కించడం కోసం, కృష్ణుడు, కౌరవకులం వొక్కటే కాక, పద్ధెనిమిది అక్షౌహిణులను మసిచేసి పారేశాడు.

అది మృదుత్వమా ?

కృష్ణరాయడు కొన్ని లక్షల సంసారాలు బుగ్గ చేశాడు.

అదిన్నీ మార్దవమా ?

ఏదో వొక గొప్ప పని చేసిన ప్రతీవాడి దగ్గిరా యిలాగ హద్దులేని కాఠిన్యం కనపడుతుంది.

నిర్దాక్షిణ్యంగా అంతంత కాఠిన్యం అవలంబించడం వల్లనే వారు మహాపురుషులు కాగలిగారు.

కాని ఆకాఠిన్యానికి వుద్దేశం ధర్మసంస్థాపనమూ, కారణం దుష్టుల ఔద్ధత్యమూ, ఫలితం శిష్టరక్షణమూ మాత్రం కావాలి.

అంతే.

మరి ప్రకృతం.

ఆంధ్రపత్రిక అనుకున్నట్టు కాక, గాంధిగారి జీవితంలో కూడా, కాఠిన్యం, అపారపారావారంగా వున్నది.

ప్రతీ సందర్భంలోనూ ఆకాఠిన్యం విలయతాండవమే చేస్తున్నది.

కొంచెమయినా గొప్ప అయినా బోసుగారి యెడల గాంధిగారు చూపించినది కాఠిన్యమే అని ఆంధ్రపత్రికే చెబుతున్నది; కనక ఆవిషయం యిక వుటంకరించనక్కర్లేదు.

పోగా,

డాక్టరు. ఖరేగారిని పడగొట్టడం మృదుత్వమా ;

నారిమన్‌గారిని కూలగొట్టడం మృదుత్వమా ?

ప్రకాశంగారికి పక్షనాయకత్వమూ, ప్రధానమంత్రి పదవీ తక్కకుండా చెయ్యడం మృదుత్వమా ?

ధర్మమార్గప్రవర్తకు లైన బోసుగారిని పడగొట్టడానికి పట్టాభిగారిని వుపయోగించుకోవడం మృదుత్వమా ?

గుడ్డిగవ్వంత విలవా, ప్రయోజనమూ లేని హిందీకోసం వేలకొద్దీ మాతృభాషాభిమానులను జెయిళ్లలో మగ్గబెట్టించడం మృదుత్వమా ?

గుజరాతీమిల్లుల గిరాకీకోసం మాంచెష్టరు బట్టలు తగలబెట్టించడం మృదుత్వమా ?

మాటిమాటికీ ఉపవాసాలు చేసి ఇతర్లను పీడించడం మృదుత్వమా ?

వర్ధమానచంద్రు లైన కొన్ని లక్షల యువయువతులను పికెటింగులో దింపి, జెయిళ్లకిన్నీ పంపి, ఆగమ్మకాకులను చేసెయ్యడం మృదుత్వమా ?

తీపికల్లు గాతీయపానీయం కావా లనడం మృదుత్వమా ?

ఆవుదూడను కాల్పించెయ్యడం మృదుత్వమా ?

ఎంతమాత్రమూ కాదు.

కానే కాదు.

నిజానికి, కానూ అక్కర్లేదు.

ఇదంతా మృదుత్వమే అయితే యీపని అంతా జరిగి వుండకపోయేది.

[దీని తరవాయి ౫౭వ పేజీ ౨వ కాలం చూడండి.]

కావ్యసృష్టి

విద్వాన్ పాలెపు వేంకటరత్నం

"పూర్వకాలంలో కవిలోకానికి కావ్యసృష్టిపరికరాలు భారతీలాస్యజనితమధుర నినదాలే. లేకుంటే అంత నిరాఘాటధార, సాకూతమధుర మైన శబ్దజాలం అమిరి వుండదు" ఈ అర్థం విద్యానాథుడి "ప్రతాపరుద్రీయం" చదివాక స్థిరపడి నా లేఖినిని ఈ ప్రకారంగా నడిపించింది. 'రచయిత'

రంగం: కవిగృహం: కవి చిత్రాసనంమీద ధ్యాననిష్ఠలో కూచుని ఉంటాడు: మూర్తీభవించిన బ్రహ్మతేజస్సు: పరిణతమేధాశక్తి, అర్ధముకుళితనేత్రాల సందుల్లోంచి విద్యుత్తీక్ష్ణతల్లా బయటికి ప్రసరిస్తోంది. సాక్షాచ్ఛివమూర్తిలా విశాలఫాలంమీద దట్టమైన విభూతిరేఖలు ధరించి నడుమ కుంకుమతిలకం పెట్టుకున్నాడు. మెళ్లో వేసుకున్న పెద్ద రుద్రాక్షతావళంలో మధ్యపూసకు మాత్రమే బంగారు తాపడం ఉంది. విద్యానాథకవి గంటం పత్రం మీదుంచి గంభీర కంఠంతో పిలిచాడు.

కవి—రావమ్మా! భారతీమాతా!

చాటునుంచి

కిటతక, కిటతక, కిటతక
ఝణఝణ, ఝణఝణ! ఝణఝణ

కవి—ఆఁ, పలికించమ్మా అలాగే! ఏదీ, అది నీ మేఖలాధ్వానమా? అట్టే, తెలిసింది. (వ్రాస్తాడు)

దృష్ట్వా రుద్రనరేంద్రం
తరళతరాక్షీ విలాసమృదుహాసా!

ఆఁ, కనిపించమ్మా తల్లీ! చాటెందుకూ? సాక్షాత్కరిస్తేనే కాని యీ నీ పుత్రుడు పై చరణం వ్రాయడు.

గదిలో దివ్యకాంతి ప్రవేశిస్తుంది స్వచ్ఛమైన చంద్రమండలంలాగ. ఆ తేజోమండలమధ్యస్థ శారదాదేవి, విద్యానాథుడికి గోచరిస్తుంది. ఒక్కసారి ప్రణామం చేస్తాడు.

తామరతూడుల్లాంటి చేతు లెత్తి అతణ్ణి ఆశీర్వదిస్తుంది మాత: కవి లేస్తాడు:

జనని మిథ్యావలగ్నం కుంచించి మళ్లీ లాస్య ప్రారంభం చేస్తుంది. అర్ధముకుళితాలైన కనుదమ్ములు సుదీర్ఘమైన దేవి జడ పొడుగాటి నల్లత్రాచులా వర్తిస్తోంది తల్లికి. మేఖల్లో ఉండే చిరుగంటలూ, పాదకమలాల్ని అలంకరించిన మణినూపురాలూ మనోహరంగా శబ్దిస్తున్నాయి. మాతృదేవి దివ్యహస్తాలు అనేకవిధాలైన పతాకలూ, ముద్రలూ ప్రదర్శిస్తున్నాయి.

కవి ధ్యాననిష్ఠలోనే ఉన్నాడు. ఘంటం మాత్రం పరుగెడుతోంది గబగబ.

కిటతక, ఝణఝణ, ఘులఘుల
కలయతి మౌక్తికహారం
ఝణఝణ, కిటతక ఝణంఝణా తకిట
స్ఫురతి చ కర్ణోత్పలం బాలా.

విద్యానాథుడు పూర్తి చేసి ఉచ్చైస్స్వనంతో చదువుతాడు.

దృష్ట్వా రుద్రనరేంద్రం
తరళతరాక్షీ విలాసమృదుహాసా
కలయతి మౌక్తికహారం
స్ఫురతి చ కర్ణోత్పలం బాలా!

తల్లి దివ్యలాస్యం పూర్తిచేస్తుంది. విద్యానాథుడు ప్రణామం చేస్తాడు.

కవి—తల్లీ! అనుగ్రహించు!

శారద—(ఆశీర్వదించి) నాయనా! నీ ఈ పుష్పమాల ఆంధ్రరాజు కంఠసీమ నలంకరించు. నేనే కాదు పద్మాలయా అనుగ్రహిస్తుంది.

విద్యానాథుడు—ధన్యోస్మి! మాతా నమస్తే!

కవి ప్రక్కస్థు డౌతాడు. కాంతిమండలం అంతర్ధానం అవుతుంది.

చెన్నపట్నంలో తెనుగుపిల్లలికి జరుగుతూఉన్న అన్యాయం

గొబ్బూరు వేంకటానంద రాఘవ రావు

కుబేరుడు ఈశ్వరుడికి చాలా గొప్పస్నేహితుడే. అయితే నేం? ఈశ్వరుణ్ణి భిక్షాపాత్ర మాత్రం వదలలేదు. అలాగే, చెన్నపట్నం మేయరు ఆంధ్రుడే అయినా, ఆపట్నంలో మన తెనుగుపిల్లల దురవస్థ చాలా దుర్భరంగా ఉంది.

చెన్నపట్నం తెనుగువారి తాతల సొమ్మే - అక్షరాలా మన తాతల సొమ్ము. ఈస్టిండియాకంపెనీవారికి ఈతూర్పుతీరాన నిలబడడానికి ఎక్కడా నీడ లేకపోయింది. అప్పుడు ఆకంపెనీ ఏజెంటు (Francis Day) అనేదొర అప్పుడాప్రాంతాల్ని ఏలుతూవున్న తెనుగుప్రభువు శ్రీచంద్రగిరిమహారాజావారికి పసందైన గుఱ్ఱాన్ని తెచ్చి నజరు యిచ్చుకొని, ౧౬౩౯ లో అనగా ఇప్పటికి సరీగా మూడువందల ఏళ్లకిందట ఒకనగరం పట్టు నేల వారివల్ల కవులుకు పుచ్చుకొని కోట కట్టుకున్నాడు. దానిపేరే సెయింట్ జార్జి కోట. (Fort Saint George) ఆపట్నంలో వర్తకవ్యాపారాలు మాత్రం ఇప్పటికీ విరివిగా తెనుగువాళ్ల చేతుల్లోనే ఉన్నవి. ౧౮౦ ఏళ్లకిందటి Local records సంపుటాల్ని పట్టి చూస్తే ఒక గొప్ప సంగతి బోధపడుతుంది. అదేమి టంటే— ప్రభుత్వసౌకర్యం నిమిత్తం ఆయాప్రాంతాల వాడుకభాషల్లో అక్కడక్కడి పూర్వోత్తరా లన్నీ మెకన్జీగారు ౬౨ సంపుటాలు వ్రాయించారు. అందులో ౪ సంపుటాలు మాత్రం అరవం ఉన్నది. అంటే ఏమన్నమాట? రాజధానిలో ౧౫ పాళ్లలో ఒకపాలు దేశంలో మాత్రం అరవం వాడుకలో ఉండేది. ఇలా వుండగా ;—

ఆంధ్రుల దురదృష్టంవల్లనూ, అరవల అదృష్టం వల్లనూ ౧౮౫౦ ప్రాంతంలో మొదట రైలు దక్షిణానికి పడింది. ఉత్తరదిశనుంచి కొండలమీదనూ, నాటుబళ్ళమీదనూ ఆంధ్రులు చెన్నపట్నం వెళ్లేసరికి వారాలూ, నెలలూ కాలం అయ్యేది. అరగంటలో రైలుమీద అరవ అయ్యర్లు, అయ్యంగార్లూ వగైరా లంతా చెదపుట్టల్లాగ వచ్చి పడి పట్నం ఆవరించి, ఉద్యోగాలన్నీ చెయ్యి చిక్కించుకున్నారు. అరవలకు ఆధికారమున్ను, అరవభాషకి కొంత ప్రాచుర్యమున్నూ అప్పట్నుంచే కలిగింది. ౧౯౦౦ సంవత్సరందాకా చెన్నపట్నంనుంచి ఉత్తరదేశానికి సరాసరి (Through Train) రైలుబళ్ళు నడవలేదు - పెన్న, కృష్ణ, గోదావరి - నదుల వంతెనల మూలంగా ఈఅనర్థం ఆంధ్రుడికి వచ్చింది—

అరవలు వెలుగు ఉండగానే అన్నీ నాగా చక్కబెట్టుకున్నారు. కల్పితంగా కొంతా, అకల్పితంగా కొంతా, అరవభాషాప్రాబల్యం బాగా చేసుకున్నారు.

ఇకా, ఇప్పుడు, చెన్నపట్నంలో మన తెనుగుభాష సంగతి, తెనుగువాళ్ల సంగతి బహుఘోరంగా ఉంది. స్వస్థలంలో తెనుగువారి మాట చెల్లుబడి చాలా తక్కువగా ఉంది.

చెన్నపట్నం మేయరు శ్రీ కె. వెంకటస్వామినాయుడుగారు మన ఆంధ్రులు. అయితేనేం— తక్కిన అన్యాయాల మాట తరువాత ఆలోచిద్దాం. ముందుగా పీకపట్టుకున్న ముఖ్యవిషయం— ఇప్పుడు ఊరుకుంటే, భావికాలమందు మరీ బాధించే ముఖ్యవిషయం ఒకటి ముందు మనవి చేస్తున్నాను. మన చెన్నపట్నంలో మన తెనుగుపిల్లలికి తెనుగు అక్షరాలూ, తెనుగు చదువూ చెప్పడానికి తెనుగుబడులు కనబడవు.

ఆమధ్యని నేను ఒకమాటు చెన్నపట్నం వెళ్ళి ఒక ప్రియమిత్రుని ఇంట్లో బస చేశాను. ఆయనకు ఆరుఏండ్ల ప్రాయంగల కుమార్తె చిన్నపిల్ల ఉన్నది. ఆఅమ్మాయి అరవబాలశిక్ష చేతపట్టుకుని 'పూనై కుట్టి' అని పిల్లిపాఠం చదువుతున్నది. చెన్నపట్నంలో మన తెనుగు పెద్దలకే కాకుండా పసిపిల్లలకు కూడా ముందుగా మార్గాలదర్శనం అవుతున్నదే అనుకున్నాను. అనుకుని,

"ఏం. అమ్మా? అరవపిల్లి పాఠం చదువుతున్నావు. తెనుగు చదవ వేమి?" అని అడిగాను. అంటే, ఆ అమ్మాయి :—

"చెన్నపట్నంలో మన తెనుగుమీద ఎవరికీ కాతరీ లేదండి. బళ్లో తెనుగు చెప్పరు. చదువుకోవా లంటే తెనుగుపిల్లలైనా అరవం చదువుకోవాలి. అంతే గాని తెనుగు చెప్పరు. మాస్కూలులో తెనుగుమేష్టరు లేరు. అసలు, తెనుగుకి చోటే లేదు, మాస్కూలులో" అన్నది.

ఆ అమ్మాయి చెప్పిన మాటలు వినగానే నాకు పట్టరాని దుఃఖం కలిగింది.

అయ్యో! ఇదెక్కడి కర్మం?

చెన్నపట్నం మన తాతల సొమ్మని గంతులేస్తున్నామే? ఆంధ్ర రాష్ట్రం కావాలని గొంతుక చించుకుని అరుస్తున్నామే?

ఆరాష్ట్రానికి చెన్నపట్నమే రాజధానిగా ఉండా లని తీర్మానించుకున్నామే!

అయినా, అటువంటి చెన్నపట్నంలో మన తెనుగుపిల్లలికి తెలుగు అక్షరాలు నేర్పడానికీ, తెనుగున చదువు చెప్పడానికీ ఆపట్నంలో ఎలిమెంటరీస్కూల్సు, స్కూలుమేష్టరులైనా లేరే.

ఎందు చేత?

మన తెలివితక్కువ చేత!

మన తెనుగుదేశపు నాయకులికి కూడా తెనుగుభాష అంటే ఏమీ శ్రద్ధ లేకపోవడంచేత! మాతృభాషయందూ, దేశమందూ మనవారికి కల అనాదరంచేత!

మనకు ఇంటిదేవుణ్ణి ఇగరగట్టి, పొరుగుదేవుణ్ణి పూజిస్తూ, పొరుగింటి పుల్లకూర మీద రుచీ, రంగూ ఎక్కువవడంచేత?

మన మద్రాసుకార్పొరేషనులో తెనుగుసభ్యులు లేరా?

ఆంధ్రరాష్ట్రానికంటే Secretary of State-Parliament-అంగీకారం కావాలి.

మన పసిపిల్లలికి తెనుగుతనం అబ్బడానికి, చెన్నపట్నంలో చిన్న పిల్లలికి తెనుగు అక్షరాలూ, చదువూ, నేర్పడానికీ, Parliamentary Legislation కావాలా?

అక్కర్లేదే!

అక్కర్లేకపోతే మన తెనుగునాయకులికి ఈవిషయంలో ఉపేక్ష ఎందుచేత?

ఉలికొన దూరిం దంటే మాను ముక్కలయిం దన్నమాటే!

మన పిల్లలికి ఆంధ్రమందు విముఖతా, అరవమందు దాస్యమూ ప్రారంభం అయ్యే మూలస్థానం ఈస్కూళ్లలోనే అని మన పెద్దలికి తెలియదా? ఇకనైనా మన చెన్నపట్నపు పెద్దలు ఈఅన్యాయం తొలగించడానికి పూనుకుంటారా?

లేకపోతే మనపిల్లలికి వెధవతెనుగు చదువు, ఎందు కని ఊరుకుంటారా?

దీని కేమంటారు? మన మద్రాసు మేయరు శ్రీ వెంకటస్వామి నాయుడుగారున్నూ, మద్రాసు కార్పొరేషనులో ఉన్న ఇతరాంధ్ర సభ్యులున్నూ?

ప్రగల్భాలు

కొడవటిగంటి కుటుంబరావు

ఆరోజుల్లో గాంధీమహాత్ముడు ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించాడు. లాఠీఛార్జీలతోనూ, అరెస్టులతోనూ, ఉపన్యాసాలతోనూ దేశం ఉడికిపోతున్నది. కుఱ్ఱవాళ్లంతా నాయకులైనారు. సరిగా గడ్డాలూ మీసాలూ రానివాళ్లు సయితం వేదికలెక్కి ఉపన్యసిస్తూ, తమ ఉద్రేకాన్నీ, ఉత్సాహాన్నీ ప్రకటిస్తుంటే చూడ ముచ్చటగా ఉండింది.

ఆరోజుల్లో ఆ వాలంటీర్ల ఉత్సాహం అంటువ్యాధివలె వ్యాపించిందంటే ఆశ్చర్యంలేదు. ప్రతిరోజూ ఆసభలకు వేలకువేలు జనం వచ్చేవారు. సభ ముగిసేవరకూ ఒక్కరైనా కదిలేవారు కారు. మనంతట మనం పారవశ్యం తెచ్చుకోలేని పక్షంలో మరొకరి పారవశ్యం చూడటమైనా కొంత తృప్తే!

నేనూ శర్మా ఈ సభలకు రోజూ వెళ్లేవాళ్లం; మాకు దేశభక్తి పొర్లిపోయిం దని కాదు, మాకై మేము తెచ్చుకోలేని ఉద్రేకం ఈ విధంగా తెచ్చుకుందామనీన్నీ కాదు—మానవప్రకృతిని గమనించటానికి ఈ సభలద్వారా మాకు మంచి అవకాశం లభించింది.

గాంధీమహాత్ముడు ఉద్రేకం లేకుండా చెప్పిన విషయాలను వాలంటీర్లు ఎంతఉద్రేకంతో ప్రచారం చేశారో మేము గమనించాం. ఉద్రేకం లేకపోతే ఉద్యమమే లేదు. కొందరు కొందరి ఉపన్యాసాలలో హింసాబుద్ధి తాండవం ఆడుతున్నది. వారి ఉపన్యాసాలు జనానికి చాలా ఇంపుగా ఉండినై. అవకాశం లేక అణిగిపడి ఉన్నారే గాని అహింసాతత్వం ఆవాలంటీర్లకు ఏమి అర్థమవుతుంది?

నిన్నటివరకూ ఆవాలంటీర్లంతా ఎవరిస్వార్థంలో వారుగా ఉండినవారే. దేశాన్ని గురించిగాని, దేశవిపత్తును గురించిగాని, దేశసేవ గురించికాని వారికేమీ పట్టలేదు. దేశసేవకులమని గర్వంగా చెప్పుకునే సాహసం కూడా వారికి ఉండి ఉండదు. దేశసేవ తమబోటి సామాన్యులకు అందుబాటులో ఉన్న విషయమని వారికి తట్టికూడా ఉండదు. కాని ఈనాడు మహాత్ముడి అనుగ్రహం వల్ల దేశసేవ అనేది సుస్పష్టమై చేతులో ఉన్నదిగా పరిణమించింది. ఏముందీ? ఉప్పు చెయ్యటమూ, లాఠీదెబ్బలు తినటమూ, జైలుకు పోవటమూ! ఒంటరిగా చెయ్యవలసివస్తే అదిమటుకు సులభం కాదు. నలుగురితో పాటు నారాయణా. అదీకాక ఎంతకష్టమైనపని అయినా అస్పష్టంగా ఉండక పోయినట్టయితే ఉద్రేకంలో నెత్తిన వేసుకోవచ్చును. ముందూ వెనకా చూసుకున్నవాడు పాపాత్ముడు! "భారతదేశం ఎక్కడ? దీనికి దాస్యవిమోచనం కలిగించటం ఎక్కడిది? అందుకుగాను ఉప్పు వండటం ఏమి కార్యక్రమం? ఒకవేళ గాంధీ మహాత్ముడు సరిఅయిన మార్గం తొక్కలేదేమో?—ఈ విధంగా ఆలోచన చేసినవాడు—బుర్ర ఉపయోగించటానికి ప్రయత్నం చేసినవాడు పాపిష్టి!

నేనూ శర్మా పాపిష్టివాళ్లం. మేము స్పష్టంగా తెలుసుకోలేకపోయినాము గాని జరుగుతున్న తంతులో ఏదో వెళాకోళం, వేలంవెర్రి, ఉందని మాకు అస్పష్టంగా తోచింది. స్వతంత్రంగా ఆలోచించాలని మాకు అభిలాష లేకపోయినట్టయితే, ఒకరు చెప్పినదాన్ని మారుమాటలేకుండా విశ్వసించే శక్తి మాకు ఉండినట్టయితే, మేము కూడా ఉద్రేకంలో వాలంటీర్లుగా చేరి ఎరెస్టు అయి ఇతర వాలంటీర్ల మాదిరిగా మాకూ గాంధీకీ జాతిభేదం ఏమీ లేదు, కాస్తలో మేమూ గాంధీలమే అనుకోగలిగే వాళ్లమేమో!...

ఒకనాడు సాయంకాలం నేనూ శర్మా సభకు పోతూ ఉండగా దారిలో మాకు నాయుడు తగిలాడు; ఏమిటి కథ, ఎందుకు! ఎక్కడికి, అంత హడావుడిగా పోతున్నారని అడిగాడు. మీటింగుకు వెళుతున్నామని చెప్పాం. కావలిస్తే వాణ్ణికూడా రమ్మన్నాం. నాయుడు బిగ్గరిగా నవ్వాడు. మా దేశభక్తి చాలా పరిహాసాస్పదంగా తోచింది వాడికి. ఆట్టే దేశభక్తి లేనట్టు నటించటం మాలో కొందరికి చాలా తెలివితో కూడుకున్న పనిగా కనిపించేదని తెలుసుకో

వాలి. వాసుకూడా ఈవిషయంలో మాలో చేరినవాడే. కానీ మాకూ వాడికీ ఉండిన తేడా ఏమంటే, దేశభక్తి ఛాందసమని తేల్చుకుని వాడు దానిజోలికి వెళ్లటం మానేశాడు—మేము పూర్తిగా దేశభక్తికి వైదొలగలేదు.

“నీ నవ్వుకేం లే? అక్కడ ఎంత కళకళగా ఉందో నీకేం తెలుసు? సభామండపం పెళ్లిపందిరి మాదిరిగా ఉంది. చూసి తీరాలిరా, వాసూ!” అని మేమిద్దరమూ వాడికి పురెక్కించాం. చాలాసేపు మాతో రానంటే రానని ఆఖరుకు వాసుగాడు నస పెడుతూ సభకు వచ్చాడు.

ఆనాడు ఆఉపన్యాసాలు వింటున్నంతసేపూ వాసు మనస్సులో ఏ ఆలోచనలు రేకుతున్నదీ మేమెరగం. మాలో కలిగిన అభిప్రాయాలకు భిన్నమైనవి వాడిలో కలుగుతూ ఉండవచ్చునని కూడా మాకు తట్టలేదు. సభ ముగిసి మేమింటికి వచ్చేటప్పుడైనా వాసు మాతో ఏమీ అనలేదు. అప్పుడు వాడి మనస్సు పరాయత్తంగా ఉన్నదని కూడా మేము కనిపెట్టలేక పోయినాం.

మర్నాడు మేము మామూలువేళకు బయలుదేరి దారిలో వాసును కూడా కేక వేశాం. రెండు మూడు కేకలు పెట్టిన తరవాత గర్భవతిగా ఉన్న వాడి భార్య తలుపుతీసి వాసు అంతకు పూర్వమే ఎక్కడికో వెళ్లాడని చెప్పింది.

“మనం మళ్లీ తగులుతామని తప్పించుకున్నాడు—లద్దీకే!” అన్నాడు శర్మ.

వాణ్ణి మరిరెండు తిట్టి మాదారిని మేం సభకు వెళ్ళాం.

మేము చేరేటప్పటికి బ్రహ్మాండమైన సభ జరుగుతున్నది. ఆనాడు పోలీసు రిజర్వు వస్తుందని తెలిసి జనం రెట్టింపుగా వచ్చారు. జనంలో ఉద్రేకం కూడా హెచ్చుగా ఉంది. పొరుగూళ్లనించి రెండువందలమంది కేవలమూ పోలీసుమీద తిరగబడే ఉద్దేశంతో వచ్చినట్టు కూడా చెప్పుకుంటున్నారు. పోలీసుసంఖ్య ఏ రెండు మూడు వందలలో ఉంటేగాని పని జరిగేటట్టు కనిపించలేదు.

నేనూ శర్మా ఆజనంలో చోటు చేసుకుని ఇరికి ఉపన్యాసం వినసాగాం. మాట్లాడవలసినవారు చాలామంది ఉన్నారు. అధ్యక్షుడు అయిదు నిమిషాల కొకరి పేరు చెబుతున్నాడు.

“......వాసుదేవరావుగారు ఉపన్యసిస్తారు”, అని అధ్యక్షుడు తెలియజేశాడు.

ఒక్కసారిగా నేనూ శర్మా మొహామొహాలు చూసుకున్నాం. మరుక్షణంలోనే మాసందేహం నివృత్తి అయింది. కొత్త ఖద్దరు బట్టలు కట్టుకుని పెళ్ళికొడుకు అవతారంతో వాసుగాడు ఉపన్యసించటానికి లేస్తున్నాడు!

వాడు పది నిమిషాలు మాత్రమే మాట్లాడాడు. కాని అది అన్నివిధాలా అపూర్వమైన ఉపన్యాసం. మామూలుగా ఇతర ఉపన్యాసకులు తొక్కిన మార్గం తొక్కక వాడు సొంతంగా కొత్తపంథా తొక్కాడు. ఇతరులు ప్రభుత్వాన్ని నిరసించారు. తాము చెయ్యబోతున్న త్యాగాన్ని గురించి ఘనంగా చెప్పుకున్నారు. ఆత్యాగం యొక్క ఆవశ్యకతను గురించి శ్రోతలకు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశారు. కాని వాసుగాడు ప్రభుత్వాన్ని వేళాకోళం చెయ్యసాగాడు. వాడు మాట్లాడుతూంటే జనానికి ప్రభుత్వమంటే ఉండిన కోపం గాని భయం గాని పోయింది. ప్రభుత్వమంటే వెర్రి ముండావ్యవహారమయింది. వాలంటీర్లు చెయ్యవలసింది ఏమాత్రమూ త్యాగం కాదనీ, జైలుకు పోవటమూ దెబ్బలు తినటమూ మొదలైనవి చాలా సరదాతో కూడుకున్న విషయాలనీ వాసు జనాన్ని నమ్మించాడు. అన్నిరోజులూ నేను అటువంటి ఉపన్యాసం వినలేదు. వాడు కూర్చోగానే కరతాళధ్వనులు మారుమోగిపోయినై......

నేనూ శర్మా ఇంటికి వస్తూ వాసుగాణ్ణిగురించి చర్చించాం.

“వాడు ఉపన్యాసాలివ్వటానికి పుట్టాడు వేదిక లెక్కటం రాసిపెట్టి ఉంది. మనం వాణ్ణి బలవంతాన ఇందులో తెచ్చి పడేశాం ఇది రుచి మరిగాడు, ఇక వాడు మన ప్రపంచంలో పడటం దాదాపు అసంభవం”, అన్నాను.

“నీమోహమా, వాడిమోహమునూ!” అన్నాడు శర్మ మొహం చిట్లించుకుంటూ.

“ఇప్పుడేం చేస్తాం? ఇక వాణ్ణి సత్యాగ్రహంలో ప్రవేశించకుండానూ, జైలుకు పోకుండానూ మనం ఆపలేం?”

“ఆపాలి! వాడిమొహం, వాడు జైలుకు పోవటమేమిటి? నిండుచూలాలు ఆపిల్లగతి ఏమిటి? ఆమెకు పుట్టింటివారు ఉండీలేనట్టే. అక్కడ వారికి తిండిఅయినా లేదు. ఆమెకు ఈ వెధవే సమస్తమూనూ. వాడు జైలుకుపోవడానికి వీల్లేదు. ఆపిల్ల గుండెపగిలి చస్తుంది” అన్నాడు శర్మ.

శర్మ వాసుభార్యను పెద్దమనిషి తరహాగా ప్రేమించాడని నేనెరుగుదును. శర్మే కాదు, మేమంతా కూడా ఆ అమ్మాయిని అంత అభిమానంగా చూసేవాళ్లం. ఆమె అంత అమాయకురాలూ, మొగుణ్ణి పంచప్రాణాలుగా చూసుకునేదీన్నీ. నా అనుభవం ఏమంటే ప్రేమించేమనిషిని లోకమంతా ప్రేమిస్తుంది.

“సరే, చూతాం—ఆలోచింతాం!” అన్నాను.

ఆరాత్రి భోంచేసి నేనూ శర్మా వాసుగాడిదగ్గిరికి వచ్చాం. తొమ్మిదిలగాయతు రాత్రి ఒంటిగంటవరకూ ముగ్గురమూ తర్కించాం. కాని లాభం లేకపోయింది. నేననుకున్నట్టే వ్యవహారం ముదిరిపోయి ఉన్నది. వాసుగాడు సరిఅయిన తర్కానికి రా నిరాకరించాడు. “నేను జైలుకు పోయి తీరతాను. దేశమోక్షానికి అది నాకంతు త్యాగం. త్యాగంచేసేవాడు తన కష్టనష్టాలు లెక్కచూసుకుంటూ కూర్చుంటాడా?... నేను ప్రభుత్వాన్ని గుర్తించను. ప్రభుత్వశాసనాన్ని గుర్తించను. ఉప్పు తయారుచేసి, శాసనోల్లంఘనం ద్వారా నా స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తాను?” ఇదీ వాడిధోరణి.

నాకూ శర్మకూ ఏమీ పాలుపోలేదు. వాసును ఈ కొంటెపని చెయ్యకుండా ఆపటం ఎట్లా ?

"ఆవెధవకు దేశం ఎటుపోయేది పట్టలే. ..సలు దేశమేమిటో వాడికి తెలియదు. వాడికప్పుడు కావలిసిందల్లా ఖ్యాతి. జైలుకు పోవటమూ, ఫొటోతో సహా వాణ్ణిగురించి పేపర్లలో పడటమూ, నలుగురూ చెప్పుకోవటమూ—ఇదే వాడికి కావలిసింది. నాకుమంటే అందుకని !" అన్నాడు శర్మ.

శర్మగాడు చెప్పింది అక్షరాలా నిజం. నాకై నేను వాసును గురించి దిగులుపడి ఉండేనుగాని శర్మగాడి ఆదుర్దా నన్ను నిలవ న్వకపోయింది.

"చూతాంలే—ఏదో చేతాం !" అన్నాను శర్మతో.

మరి రెండురోజులు గడిచినై. ముప్పైమంది మీద ఎరెస్టువారంట్లు పుట్టినవనీ, వారిలో వాసుకూడా ఉన్నాడనీ మాకు తెలిసింది.

"అతను బయటికివచ్చి ఉపన్యాసం ఇవ్వకుండా ఆపిపెట్టండి. నేను వారంటు ఆపిపెట్టగలను !" అన్నాడు పోలీసుడిపార్టుమెంటులో ఉన్న నాబంధువు.

వాసును ఇల్లు కదలనివ్వరాదు—శర్మకోసమే అయినా. ఈపని ఎట్లా సాధించటం ?

అకస్మాత్తుగా తట్టింది ఉపాయం. నేను సంతోషంతో పొంగిపోయినాను. వెంటనే బయలుదేరి శర్మదగ్గిరికివెళ్లి వాడితో చెప్పేశాను. శర్మ మొదట్లో నా తెలివితేటలకు నిర్ఘాంతపోయి ఆతరవాత నన్ను వీపుపగిలేటట్టు చరిచి, "రైట్, బ్రదర్ ! ఈదెబ్బతో వాసుగాడితల తిరిగి నోట్లోకి రావాలి !" అన్నాడు.

వెంటనే అయిదు నిమిషాలలో మాప్లాను పూర్తిచేసుకున్నాం.

మర్నాడుదయం సూర్యోదయం కాకపూర్వమే నేనూ శర్మా వాసుగాడింటికి పోయినాం. అప్పటికింకా వాడు నిద్ర లేవక పోవటంవల్ల మేమే వాణ్ణి లేపాం.

"ఇంత పొద్దున్నే దాపరించారేం, శనిగ్రహాలు ?" అన్నాడు వాసు. మేము వెనక వాడితో తర్కించినప్పటినించీ వాడు మమ్మల్ని దేశద్రోహులకిందా తనకు విజాతీయులకిందా చూస్తున్నాడు.

"మాకు కొన్ని సందేహాలుండి అడగటానికి వచ్చాం. ఇది చాలా అర్జంటు విషయం" అన్నాను.

"అదివరకు నన్నడిగిన వేనా ?"

"అవును."

"నేను మీతో ఆవిషయాలిక మాట్లాడను."

"అట్లాకాదు. తొందరపడకు. మమ్మల్ని మార్పుచేసే బాధ్యత నీ మీద ఉంది. మేమిద్దరమూ వాలంటీర్లు కావచ్చును. ఎవరు చూశారు !"

"నువ్వెంతలో మారిపోయినావో చూడు ?" అని శర్మ అందుకున్నాడు.

"ఏమిటవి మీసందేహాలు ?"

"అసలీ ఉద్యమం దేనికి ?"

"ప్రభుత్వాన్ని ప్రతిఘటించటానికి— శాంతియుతంగా ప్రతిఘటించటానికి ?"

"ప్రభుత్వంతో మనకు పనిలేదన్నమాటేగా ?"

"ఆహా ! నిరభ్యంతరంగా !—అంటే ఇప్పుడున్న ప్రభుత్వంతో మనకు పనిలేదు."

"మరి ప్రభుత్వం మనని ఎరెస్టుచేసి జైలులో పెడితే ?"

"పెడితే పెట్టనీ ! మనం ప్రభుత్వాన్ని గుర్తించం."

"జైలుకు రమ్మంటే పోతామా ?"

"బలత్కారం చేస్తే పోతాం. ఇది శాంతి సమరం."

"ప్రభుత్వం మనల్ని గుర్తించకపోతే ?"

"ప్రభుత్వం లేదన్నమాట. ప్రభుత్వ శాసనమే లేదన్నమాట."

"అయితే ఈఉద్యమంలోకి అందరూ రానక్కర్లేదన్నమాట. ప్రభుత్వం లేదని కొద్దిమంది నిరూపిస్తే చాలుగా !"

"ఓరి పిచ్చివాడా ! ప్రభుత్వం మనని ఉప్పు చెయ్యనిస్తుందా ? ఎరెస్టుచేసి తీరుతుంది. ఒకరి తరవాత ఒకరు రాకపోతే ఉద్యమం చచ్చిపోతుంది. ఎంతమంది త్యాగం కావాలో ఈఉద్యమం జయప్రదం కావటానికి !"

"అట్లా అయితే మనవంటి అనామకులం కాస్త వెనక ..పోరాదూ ? త్యాగం చెయ్యటానికైనా అందరికీ సమానమైన అర్హత ఉండదుగా ?"

వాసుకు కోపం వచ్చింది. వాణ్ణి అనామకుడనటమూ వాడికి అర్హత లేదనటమూ సహించలేక పోయినాడు.

"అర్హత అంటే ఏమిటి ?"

"నువ్వే ఉన్నావనుకో. నువు ఎరెస్టయి దేశానికి చేసే ఉపకారం కంటె నీభార్యకు ఎక్కువ అపకారం చేస్తావనుకో అప్పుడు నీకుం త్యాగం చేసే అర్హత లేదన్నమాట !"

"అర్హత హృదయంలో ఉంది."

"అయితే త్యాగమూ హృదయంలోనే ఉంటుంది. నువు ఎరెస్టు కావటం మాకిద్దరికీ ఇష్టం లేదురా, వాసూ. నీమీద వారంటున్నది. నువు బయటికి కదిలితే తప్పక ఎరెస్టవుతావు !"

వాసు మొహం ఒక్కసారిగా వికసించింది. "ధన్యుణ్ణి, ధన్యుణ్ణి !" అంటూ వాడు మంచం మీదినించి లేవబోయినాడు.

మే మిద్దరమూ వాణ్ణి బలవంతాన కూర్చొబెట్టి, "ఒరే, వాసూ తొందరపడకు, నీభార్య గర్భిణి. ఆపిల్లకు నువ్వే సమస్తమూ. ఈ సమయంలో నువ్వు దగ్గిర ఉండటం ఆమె మనస్సుకు ఎంతో తృప్తిగా ఉంటుంది", అని మంచిగా అన్నాను.

వాసు వెధవనవ్వు నవ్వి, "దాని కింకా అయిదారు మాసాల దాకా నాతో పని ఉండదు !" అన్నాడు.

అంతకంటె కూడా ముతకగా మాట్లాడుకోగలం మాలో మేము. అయినప్పటికీ వాడి అకాలహాస్యానికి నా రక్తం ఒక్క సారిగా ఉడికిపోయింది. అప్పుడు వాణ్ణిచూస్తే పుట్టిన ఏవగింపు నాకు జన్మలో ఎన్నడూ కలగలేదు. దేశభక్తి ఎవడిలోనైనా అంత నీచత్వం కలిగిస్తుందని నేను పూర్వం ఎరగను.

"ఇంకేమైనా ఉన్నయ్యా సందేహాలు?" అన్నాడు వాసు ఇంకా నవ్వుతూనే.

"లేవు?" అన్నాడు శర్మ పళ్లు బిగబట్టి.

"అయితే వేంచెయ్యండి, నాకు పని ఉంది!" అంటూ వాసు పక్కమీదినించి లేచాడు.

శర్మ వాణ్ణి మళ్లీ పక్కమీద కూలదోసి, "కదలకు. నువ్వీగది దాటి పోవటానికి వీల్లేదు. నీకేమైనా కావాలంటే మేము తెచ్చి ఇస్తాం!" అన్నాడు.

వాసు కళ్లెర్రచేసి, "వ్యవహారం ముదురుతున్నదే! నవ్వులకైనా అంతుండాలి!" అన్నాడు.

"ఇది ఎగతాళి కాదు. నిన్ను మే మిద్దరమూ ఎరెస్టు చేశాం!" అన్నాను.

వాసు ఒక్కక్షణం నిర్ఘాంతపోయి మావంక చూసి బిగ్గరగా నవ్వాడు.

"నవ్వనీ! మొదట్లో అట్లాగే అనిపిస్తుంది," అన్నాడు శర్మ నాతో.

వాసు మళ్లీ లేచాడు. శర్మ మళ్లీ వాణ్ణి మంచంమీద తోశాడు. మరుక్షణం వాసు శర్మమీద కలియబడ్డాడు. నేనూ శర్మా కలిసి వాణ్ణి పట్టుకుని మంచంమీద కూర్చోబెట్టగలిగాం.

"నువు సరిగా ప్రవర్తించకపోతే చేతులకూ కాళ్ళకూ బేడీలు వేసి గూట్ళో విరగ్గొడతాం!" అని నేను వాసుకు తెలియజేశాను.

వాసుగాడికి భయంకరాకారం పడ్డది.

"ముందు మీరిద్దరూ నాఇంట్లోనించి బయటికి పొండి!" అని వాడు బిగ్గరిగా అరిచాడు.

"పిలు! పోలీసుల్ని పిలిచి మమ్మల్ని బయటికి వెళ్ళగొట్టించు!" అన్నాడు శర్మ నవ్వుతూ.

వాసు మొహం పాలిపోయింది. మాట్లాడితే వాడిగొంతు వణికింది.

"మీ ఇద్దరకీ పిచ్చెత్తింది!" అన్నాడు వాడు.

"కాదు. నీకే ఎత్తింది పిచ్చి. నువ్వు ప్రభుత్వాన్ని గుర్తించవు కాని నీ అధికారాలను రక్షించేటందుకు ఏ పోలీసైనా కావాలి! నువు పోలీసును గుర్తించవు కాని వాడే నిన్ను ఎరెస్టు చెయ్యాలి! మేము పనికిరాం! శాంతి సమరమే కాని, అది తుపాకులు చూపించేవాళ్ళమీద! మామీద అయితే తిరగబడతావు! నీ ఇంటినించి మమ్మల్ని వెళ్లగొడతావు కాని దేశంకోసం త్యాగం చెయ్యగలవు!" అన్నాను నేను ఎగతాళిగా.

"అది కాదోయి, పెద్దమ్మా!" అని శర్మ అందుకున్నాడు. "మనం ఎరెస్టు చేస్తే వాడిపేరూ ఫోటోపత్రికల్లో ఎవరు వేస్తారూ? ఎవరు చెప్పుకుంటారూ? వాడికీర్తి దశదిశలా ఎట్లా వ్యాపిస్తుందీ!"

వాసు తల వంచుకుని మాట్లాడలేదు.

అయిదు నిమిషాలపాటు ఎవరమూ మాట్లాడలేదు. ఆఖరుకు నేను, "మాకిద్దరికీ కాస్త పనిఉంది. వెళ్లి ఒక అరగంటలో వస్తాం. అంతదాకా నువు కదలటానికి వీల్లేదు. మామూలు ఖైదీవైతే మేము నమ్మి ఉండం కాని నువు నియమానికి బద్ధుడివై ఉండే సత్యాగ్రహివి కనక మేము వెళ్లిన మరుక్షణం తప్పించుకు పారిపోతావని మాకు భయంలేదు!" అన్నాను.

నేనూ శర్మా వాసును వదిలిపెట్టి వచ్చేశాం.

* * * * *

ఆనాడే ౧౪౪ సెక్షను అమలులోకి వచ్చింది. అనేకమంది ఉపన్యాసాలిచ్చి ఎరెస్టయినారు. వాసు మాత్రం ఆచాయలకు వెళ్లలేదు.

ఎంతచెడ్డా వాడు మాలోవాడే!

అముద్రితగ్రంథములు—వరదరాజ రామాయణము

శేషాద్రి రమణకవులు

అవతారిక — అముద్రితగ్రంథచింతామణి, సరస్వతి, వైజయంతి ప్రబంధకల్పవల్లరి, చింతామణి లోనగు మాసపత్రికలు అముద్రిత గ్రంథముల సేకరించి ముద్రించి ఆంధ్రవాఙ్మయమునకు సమర్పించి కృతకృత్యము లయ్యెను. ఇపుడాంధ్రసాహిత్యపరిషత్పత్రిక—యథాశక్తితో ప్రాచీనగ్రంథప్రచురణము సాగించుచున్నది. ప్రాచ్యలిఖిత పుస్తకాలయపక్షమునను ఆంధ్రపరిశోధకమండలి పక్షమునను ఆంధ్ర సాహిత్యపరిషత్పక్షమునను లిఖితగ్రంథసంపాదనము విరివిగ జరిగినది. ఈ సంస్థలిపుడు గ్రంథసంపాదనకార్యము నిర్వహించుచున్నట్లు లేదు. తంజావూరు సరస్వతీభాండాగారము, పరవస్తువారి ఆర్ష గ్రంథాలయము, హైదరాబాదు కృష్ణరాయగ్రంథాలయము, రాజమహేంద్రవరము గౌతమీగ్రంథాలయము, హనుమకొండలోని మా పరిశోధకమండలి, ఆంధ్రవిశ్వవిద్యాలయము అముద్రితములు ముద్రితములు నగు లిఖితాంధ్రగ్రంథములతో విలసిల్లుచున్నవి. ఒక తంజావూరు భాండాగారమునకుఁ దక్కఁ దక్కినవానికి అందరకు నందుబాటులో నుండఁదగిన పట్టికలు లేవు. మదరాసు విశ్వవిద్యాలయము వారును, కీర్తిశేషులగు దేశోద్ధారకులును, పైఁడావారి

విరాళముతో ఆంధ్రసాహిత్యపరిషత్తువారు అముద్రితగ్రంథముల వెలువరించి భాషాసేవ గావించిరి. ఇంక నెన్నియో అముద్రితగ్రంథములు ఆంధ్రసోదరుల గృహములలో మాఱుమూలల బడియున్నవి. యజమానులకు వాని యోగ్యతాయోగ్యతలు తెలియవు. తమపెద్దలు సేకరించిన గ్రంథధనము చేతులార యొకరికేల యీయవలయునని వీరి తలంపు. కాలక్రమమున క్షీణించుకొలఁది ఈగ్రంథములనే ప్రవాహముననో పాడుబడిన నూతులలోనో బాఱవైచి కృతార్థులమైతి మనుకొనుచున్నారు. ముద్రితగ్రంథములని చెప్పుకొనఁదగిన ఉత్తరహరివంశము, క్రీడాభిరామము, నన్నెచోడుని కుమారసంభవము, శ్రీనాథుని హరవిలాసము, శివరాత్రిమాహాత్మ్యము, కేతనదశకుమారచరిత్రము, మల్లికార్జున పండితుల శివస్తోత్రము, మున్నగు గ్రంథములు ప్రత్యంతరములే లభించుటలేదు. ఆథర్వణాచార్యుల భారతము ఎఱ్ఱాప్రగడ రామాయణము కొమ్మన శివలీలావిలాసము శ్రీనాథుని సప్తశతి, శివదేవుని పురుషార్థసారము, మున్నగు గ్రంథరాజముల యునికికి లక్షణగ్రంథములే శరణ్యములు. ఇప్పటికిని గద్వాల, ఆత్మకూరు జటప్రోలు వనపర్తి మున్నగు నిజామురాష్ట్రమునందలి ఆంధ్రసంస్థానములందును దత్రత్యవిద్వాంసుల గృహములందును బ్రాహ్మణాగ్రహారములందును పూర్వకవివంశజుల గృహములందును గ్రంథసముదాయము నామావశిష్టముగా నున్నది. దీని నుద్ధరించు స్వార్థత్యాగులు తఱచుగఁ గనుపట్టరు. శ్రీపీఠికాపురాధీశ్వరులు గ్రంథముల సేకరించుటలోను మేలైనవి ముద్రించుటలోను ఆదర్శప్రాయులైరి. ఇటులె దోమకొండ వనపర్తి, జటప్రోలు, వెంకటగిరి ప్రభువులు, కార్వేటినగరాధీశులు గొన్ని యపూర్వగ్రంథములు ప్రచురించిరిగాని యందుఁ గొన్ని సామాన్యులకు అనుపలభ్యములు. ఆంధ్రవిశ్వవిద్యాలయప్రధానపోషకులగు శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మగారు సారస్వతమునఁ గల అపూర్వగ్రంథములను బ్రోవు చేయుటకు బ్రకటించుటకును ఆంధ్రవిశ్వవిద్యాలయపక్షమున నిధి నేర్పఱచి సంవత్సరాదాయముతోఁ గార్యనిర్వహణ మొనరించుచుండిన వాఙ్మయవికాసము సర్వతోముఖము జరిగెడిదే. కవితాకౌశలు లగు శ్రీవారి హృదయమున ఆంధ్రభారతి యీ యమోఘసంకల్పము నుదయింపఁ జేసినచో నాంధ్రుల కంటె ధన్యులెవరు ?

ఇప్పటికే విషయవిస్తృతి యైనది. ప్రధానాంశ మటులే యున్నది. గడచిన ప్రబుద్ధాంధ్రలో వరదరాజకవి కాలనిర్ణయము చేయుచు వరదరాజరామాయణమును గూర్చి ప్రస్తావించి యుంటిమి. నిజామురాష్ట్రమున గత సంవత్సరము ఒక మిత్రుని యింటియందు గొన్ని యపూర్వగ్రంథములతో బాటు వరదరాజరామాయణమునకు రెండు ప్రతులు లభించినవి. ఇట నొక కథ యప్రస్తుతమైనను జెప్పక తప్పదు. వరంగల్లుచెంతగల యొక పల్లెలో సదాచారసంపన్నుడును వైష్ణవమతావలంబియు నగు నొక రెడ్డియొద్ద కొన్ని తాటాకుపుస్తకములు గలవని యెన్నఁడో వినియుంటిమి. ఆగ్రంథయజమాని వార్ధకమునసుండి పుస్తకరక్షణము తన కసాధ్యమనియు వీని నుపయోగించువా రిపుడు లేరనియు దలంచి తెప్ప వీనిని ప్రవాహమున విడువుమని కుమారుల కాజ్ఞ యిచ్చెను. నాటిరాత్రి యొక వైష్ణవవ్యక్తి యాతని కలలోనికి వచ్చి తెప్ప గ్రంథములకొఱకు నే నొకరిని బంపెద. అంతవఱకు నిరీక్షింపుమని చెప్పెనట. మఱునాడు ఆముసలిరెడ్డి గ్రంథముల నదిలో బాఱవేయవలదని తన స్వప్నకథ నివేదించెను. మఱునాడు మాలో నొకరము ఆగ్రామమునకు బోవుటయు ఆయాచితముగ నాతని కడనుండి గ్రంథములు బడయుటయు దటస్థించెను. ఆయన యొసంగిన గ్రంథరాజములలో వరదరాజరామాయణప్రతులు రెండు గలవు. ఒకటి మాతృక. మఱియొకటి పుత్రిక. రెండును సమగ్రముగ సురక్షితముగ నున్నవి. ఇక గ్రంథవిమర్శములోనికి వచ్చుచున్నారము.

వరదరాజరామాయణము ౪౧౪ తాటాకుపుటలపై వ్రాయబడినది. వ్రాతలో స్ఖాలిత్యములు లేవు. లేఖకుడు గొంతవరకు భాషాజ్ఞానము గలవాడనియే చెప్పవచ్చును. ప్రతిపత్రమునకు ఎనిమిది పంక్తులు గలవు. ముద్రణమున నీగ్రంథము రంగనాథరామాయణమునకు ఇబ్బడిగ్రంథము గావచ్చును. డిమ్మీ ౧/౮ లో ౧౦౦౦ పుటల పుస్తకమగును. ఈగ్రంథరాజము తంజావూరు గ్రంథాలయములో గూడ నున్నటుల ఆంధ్రవాఙ్మయసూచిక వలన దెలిసినది. ఇంతవఱకిది యముద్రితమే. ఒకొక్కకాండ మొక సంపుటముగాఁ బ్రచురించినచోఁ దగిన గ్రాహకుల ప్రోత్సాహ మున్నచో గ్రంథప్రచురణ మొక కష్టకార్యము గాదు. బహుధనైకసాధ్య మగు నీ యుత్తమగ్రంథప్రచురణమునకు శ్రీరామభక్తులును భాషాసేవకులు నగు నే ధనికులేని పూనుకొన్నచో యథాశక్తిగా మేము శుద్ధప్రతియుఁ బీఠికయు వ్రాసి యొసంగెదము. శ్రీరామచంద్రుఁ డెవరికీ గ్రంథోద్ధారణకీర్తి సమకూర్పనుండెనో—

గ్రంథప్రశస్తి, కవివంశావతారము, కవితాశైఖరి దెలియుటకై వ్రాతప్రతినుండి కొన్నిభాగము లిచట నుదాహరించెదము.

కవిస్తుత్యాదికము

లోకపరిత్రాణలోలతాకలన
ఆకసంబుననుండి యవనికిఁ డిగఁగ
మాణిక్యమంజీరమధురస్వరంబు
నాకొమరా రామాయణంబు భారతము
కావించు వాల్మీకి కవివర వ్యాస
భావముల్ నాయందుఁ బనిగొనుఁగాత.
ప్రతిలేని గురుకృపారాజితు విజిత
రతిరాజు యతిరాజు, రాజితాకారు
యతి రాజయోగ మహాచార్యచరణ
శతపత్రములు సహచరములౌఁగాత.
పుట్టదేనియు రెండు పులినభాగ్యములఁ
బుట్టిన యమృతంబు పురి రెండనంగ
బరగు రామాయణ భారతంబులను

సరససారస్వతౌషధరసంబులకుఁ
జెవులు జిహ్వలు చాల సలవిచ్చినట్టి
కవి నన్నయాఖ్యుఁ దిక్కన సోమయాజి
నైపుణినాకల్పనాకన్యకావ్య
రూపమై వేంకటేంద్రు వరించుఁగాత.

కవిప్రతిజ్ఞ

ఏ కావ్యము రచింపనెలమి నాచంద్ర
లోకలోచన కీర్తి లోకంబునిండు
నే యితిహాస మూహించి గావింప
కాయంబు శ్రేయోనికాయమై వెలయు
అట్టి యాదిమకావ్య మందమై తేట
పుట్టలోకంబు లబ్బురమున నొప్ప
పునరుక్తములు వట్టి పూదెలు కొన్ని
తెనుఁగు తీచలును సందిగ్ధముల్ వ్రాలు
మాలిక లక్కటువు లేమరుటలు కొసరు
లాలంబములు వెట్టియతకడంబులును
చాయలెత్తుట యర్థచౌర్యముల్ పెట్టు
చాయలులేక లక్షణసమ్మతముగ
అందమై సుకవు లౌరా యనఁ జెవుల
విందుగాఁ గ్రంథంబు వెదజల్లినట్లు
ధ్వనులు వ్యంగ్యములు వింతలు వాసనలును
మినుకులు జిగిబిగి మెఱపులు జాతి
వార్తలు నుపమలు వర్ణనాంశములు
మూర్తి మద్వాక్యముల్ ముద్దులుజూప
ఒకమాటకన్న వేఱొక మాట వింత
ఒకపాదమునకన్న నొక పాద మొప్ప
ఒకదళంబునకన్న నొకదళంబంద
మొక యుత్తరమునుమించు నొక యుత్తరంబు
వెలయంగ ద్విపదఁ గావింపఁ జిత్తమున–

కవికృతగ్రంథములు :

పద్యకావ్యము చేసి పరమభాగవత
హృద్యచరిత్రంబు నిచ్చితి మాకు
మంగళప్రదమునామ్యము శతాధ్యాయి
రంగమాహాత్మ్యంబు రచియించినావు.

కవివంశవర్ణనము :

శ్రీకరంబుగ ధరిత్రీచక్ర మేలె
నాకల్పవిఖ్యాతుఁ డగు చోళవిభుఁడు
ఆకరికాలచోడాధీశుకీర్తి
యాకర్ణనీయ మియ్యవని నెల్లెడల
అతఁడు కావేరి కల్లనఁ గట్టకట్టి
యతిశయించెను దదీయాన్వవాయమునఁ
బుట్టిన రవివంశభూభుజావళికిఁ
గట్టాన్వయులనంగఁ గలితతేజమున
నందు వెలుంగు బిజ్జావనివిభుఁడు
కుందచంద్రోదారగురుకీర్తిశాలి
* * * * కీర్తిమంతుఁడు సాళకీపుత్రబిరుద
కర్త బిజ్జలమహీకాంతుండు వెలసె
* * * * ఆరాజదేవేంద్రు నాత్మజుఁ డయ్యె
హరిదాసరాజైన హరిదాసరాజు
అంగనాభూషణంబగు పోచిరాజు
సింగరిరాజన్యశేఖరుసుతను
బాళిమై కృష్ణమాంబను వరియించె
ఆలేమ తోఁబుట్టువగు నోబమాంబ
అర్థిమై రంగరాయలు నాల్గు పూరు
షార్థముల్ గలుగఁ గల్యాణమై మించె
నా యశోనిధిసుతుండై రామదేవ
రాయలు మాఱట రాముఁడై మించె * * * *
హరి దాసరాజు కృష్ణాంబయందునను
హరి సుదర్శమూర్తియగు రామరాజు
రాజభగీరథ రవితేజావరద
రాయని నిను దాతరాయనిగాంచె

గ్రంథాంతము.

అంకితంబుగ వేంకటాధీశచరణ
పంకజసేవాను భావమానసుఁడు
హరిదాసమణికట్ట హరిదాసరాజు
వరదరాజు నితాంతవరదానశాలి
రచియించు వాల్మీకిరామాయణంబు * * *

స్వప్నసందేశము.

బోయకులంబునఁ బుట్టి వాల్మీకి
చేయనందుఁ బ్రమోదచిత్తుండఁగాక
అర్కవంశమున నీవై జనియించి
తార్కాణగాఁగ నేతత్కథావిధము
రచియింపుమనియె శ్రీరామచంద్రునకు
అచలితప్రీతిగదా నిజాన్వయుఁడు
తనచరిత్రంబు కీర్తనసేయ నచట
తనయులచేఁ గాదె తామున్న వినియె
నుచితోపయోగ్య మీ యుత్తమకావ్య
సుచరిత్ర నీవొనర్చుట విహితంబు
సామాన్యమే రామచంద్రకీర్తనము
లేమేమి పుణ్యంబులీవు జేసితివో

నీతలిదం(డు లెన్నిభవంబులందు
భూతలంబునఁ బుట్టిపు(తుండుగలుగ
నేమేమేమి నోచిరో యుంతియగాక
యీమేటిపుణ్యంబు లేలసిద్ధించు
కలియుగ రాజజగద్విదితంబు
తలఁప నీవంశమెంత కృతార్థమయ్యె,

థమధ్యభాగము—శైలికొాఅకు.

జడలు కృష్ణాజిన శాటియుఁదాల్చి
యొడలు (శీరాము వియోగంబుచేత
మిగులంగఁ గృశియింప మేదినిమీద
ఎగలనెప్పుడు వచ్చుమాయన్న
రాఁడాయె, నేఁటికి రాకుండె, నేఁడు
రాఁడేని తనదువార్త వినంగఁగలఁడు
అని కందమూల పర్ణాశనుండగుచు
తనువు దయ్యంగ గా(తము మైలవాఅ
(బహ్మర్షి తేజుఁడై పొదుకొయుగము
(బహ్మాది కృతతపః ఫలమాగమాంత
వాదరహస్యా వాసమా(శితుల
చేఁదోడు యోగుల చేయూఁతకోల
ధార్మికులకు నెల్ల దరిదాపువిబుధ
శర్మద మమరపూజిత నిజా(గంబు
మున్నిడుకొని మానము(దవహించి
అన్నికార్యములు తదర్పణఁజేసి * * * *

(గంథమునఁ గల చారి(తకరచనాకౌశల్యాదులకు ఉదాహృతభాగములు చాలును. రసవత్తరమగు నీయుత్తమ(గంథపు టునికియే యాం(ధలోకమునకుఁ దెలియదు. ఈకవికృత (శీరంగమాహాత్మ్యము (శీ కీ. శే. చెలికాని లచ్చారావుగారు (పచురించిరి. పరమభాగవత చరి(తము పద్యకావ్యము. దాని యునికి తెలియరాదు.

ఈయుత్తమ(గంథము (పక్షి ప్తము (గంథపాతములు లేక సమగ్రముగా రెండు (పతులు లభించుట యదృష్టవిశేషము. రెండవ (పతిలో ౩౧౫ పుట లున్నవి. లిపి చిన్నది. పంక్తులు ౧౦ లేక ౯ గలవు. ఒక్కొక్క పంక్తికి ద్విపదపాదములు దాదాపుగా నెనిమిది గలవు. ఆం(ధవాఙ్మయసేవకులు (శీరామభక్తులు నగు మహాజను లెవరేని యీ (గంథరాజమును ముద్రణము గావించిరేని కవికీర్తి వ్యాప్తము గాఁగలదు. ఇంక నిట్టి యపూర్వ(గంథములు గలవారు పత్రికలలో నాయా(గంథవృత్తాంతములు (పకటించుటయు ఆం(ధ భాషకు శుభోదర్కము.

[౪౮ వ పేజీ తరువాయి]

ఇదంతా కాఠిన్యమే కాకపోతే లోకానికి గాంధిగారి పరిచయమే లేకపోయేది.

కనక, గాంధిగారి జీవితంలో కాఠిన్యం కనపడ్డదే అని యెవరూ కించపడనక్కర్లేదు.

ఇక వున్నదల్లా యేమిటంటే ?

ఈకాఠిన్యానికి పరిహారంగా, గాంధిగారిలో తగినంత ఔదార్యం లేదు.

కావలసినంత ఆర్జవం లేదు.

ఉండవలసినంత నిష్కామతా లేదు.

అంచేతనే వారి జీవితంలో, దీక్షకు తగిన పరిణతీ, సాధనకు చాలిన సిద్ధీ కనపడ్డం లేదు.

వీరేశలింగం పంతులుగారు అతికాఠిన్యం వూని, తీవ్ర(పాతికూల్యాలను నిర్లక్ష్యం చేసి, వితంతువివాహాలను (పారంభించారు.

వారు ఇప్పుడు లేరు ; కాని అవి ఆగిపోలేదు.

ఇవాళ, అవి, కన్యావివాహాల దశకే వచ్చేశాయి.

గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషావాదం (పారంభించారు.

ఆ సందర్భంలో వారెంత కాఠిన్యమయినా వహించారు.

తత్ఫలితంగా వ్యావహారికభాషారచన దేశం అంతటా అల్లుకుపోయింది.

వారి అనంతరం అది వొక్కటిమా(తమే చెలామణీ అవుతుంది.

గాంధిగారి సిద్ధాంతాలకు ఇలాంటి యోగ్యత లేదు.

గాంధిగారి (పయత్నాలకు ఇలాంటి ఫలితం వుండదు.

వారి అనంతరం వారి స్వదేశాలలో వొక్కటీ నిలవదు.

మొత్తానికి, వారి జీవితానికి, జటిలత వుంటుందే కాని సాఫల్యం కలగదు.

అయితే, వారి జీవితంలో కావలసినంత కాఠిన్యం అంకితమై వున్నది.

కేవల — శుష్క — కాఠిన్యానికి ఇదే పరిణామం.

ఇది నియంతృత్వమున్నూ కాదు.

సాధికారంగా కాంగ్రెస్సు సభ్యులైన — సుమారు నలభై లక్షల దేశభక్తుల ప్రతినిధులు ఎన్నుకున్న అధ్యక్షులు బోసుగారు.

కాని, కాంగ్రెస్సులో పావలాసభ్యులు కూడా కాని గాంధిగారు, అధ్యక్షపీఠంమీదనుంచి వారిని లాగేశారు.

ఇది గాంధిగారికి ప్రశంసాకారణమే.

మరి కాంగ్రెస్సుకి ?

నిరంకుశు లనిపించుకుంటున్న బ్రిటిషువారి రాజ్యాంగంలో — ఈబానిసదేశంలో కూడా శాసనసభాధ్యక్షుడికి (స్పీకరుకి) కొన్ని హక్కు లున్నాయి.

గొప్ప హోదా వున్నది.

ఆఅధ్యక్షుడు ఆహోదాను చెలాయించుకోవచ్చు.

ఆహక్కులను నిరభ్యంతరంగా అమలుపర్చుకోవచ్చు.

ఇవాళ, కాంగ్రెస్సు అధ్యక్షు డంటే, అలాంటి, యేడుగురు శాసనసభాధ్యక్షులమీాదా — ఏడుగురు ప్రధానమంత్రులమీాదా — ఏడు మంత్రివర్గాలమీాదా, హేమాహేమీాల పుట్ట అయిన వర్కింగు కమిటీమీాదా, వడపోతలో తేలిన కాంగ్రెస్సుకమిటీమీాదా ఏకచ్ఛత్రాధిపతి.

అతనికీ అధికారా లున్నవి.

అతనికీ గొప్ప హోదా వున్నది.

కాని, గాంధిగారి హయాము వచ్చాక మాత్రం కాంగ్రెస్సు అధ్యక్షుడు జీవచ్ఛవం అయిపోయాడు.

కాంగ్రెస్సువలంటీరుతో సమానంగా భృత్యుడున్నూ అయిపోయాడు.

దీన్నిబట్టి చూస్తే,

గాంధిగారి ప్రభ ఎంత మహోజ్వలంగా వున్నదీ;

అవును గాని, కాంగ్రెస్సు దుర్గతి యెంత నికృష్టంగా వున్నదీ ?

మార్చిలో జరగవలసిన కాంగ్రెస్సును, త్రిపురిలో, నిష్కారణంగా డిసెంబరుకి దింపేశారు.

ఈవిధంగా బోసుగారి అధ్యక్షపదవికి నాల్గుమాసాలు వ్యర్థం అయిపోయాయి.

వర్కింగుకమిటీ నిర్మాణానికి పూనుకునేటప్పటికి, మంచంమీాదనే మరి రెండు మాసాలు జారిపోయాయి.

ఇక మిగిలినవి ఆరుమాసాలు.

కళ్లుమూసి తెరిచేటప్పటికి తరవాతి కాంగ్రెస్సుకి అధ్యక్షుడు తయారు చెయ్యబడతాడు.

అయినా గాంధిగారికి తృప్తి కాలేదు.

"తప్పుకో"

"తొలిగిపో"

"దయచెయ్యి"

ఇవి తప్ప మరోమాట లేదు.

ఇలా అంటూనే గాంధిగారు మరో అధ్యక్షుణ్ణి అలంకరించారు.

సరోజినీదేవిగారు బోసుగారి రాజీనామా నిర్ధారణ కాకుండానే ఆ అధ్యక్షుణ్ణి గద్దె యెక్కించారు.

ఈతంతంతా యేమిటి ?

ఇందులో కాన్‌స్టిట్యూషన్ నేమయినా వున్నదా ?

ధిక్ !

కాంగ్రెస్సంటే యిదేనా ?

ఈకాంగ్రెస్సులో సభ్యులయి వుండిన నలభైలక్షల మందీ మాత్రమే స్వాతంత్ర్యప్రియు లట, యిదేనా వారికి ప్రియమైన స్వాతంత్ర్యం ?

ముస్సోలినీ ఆబ్సీనియా రాజునీ, అబ్సీనియారాజునీ పదచ్యుతులను చేశా డంటే, అది, గాంధిగారు బోసుగారిని పదచ్యుతులను చెయ్యడం కంటే దారుణమా ?

జపానువారివల్ల మంచూకోలో రాజుగా నిలవబెట్టబడిన చైనాయువకుడి కంటే యెక్కువ అర్భకులా రాజేంద్రప్రసాదుగారు ?

"అనిర్లోడితకార్యస్య వాగ్జాలం వాగ్మినో వృథా"

అంసెబ్లీ స్పీకరు సాంబమూర్తిగారు, ఈమధ్య ఏలూరు, రాజమహేంద్రవరం, రామచంద్రపురం సభల్లో మాట్లాడుతూ, ఆంధ్రరాష్ట్రం ఆంధ్రుల ఆందోళనవల్లనే సిద్ధిస్తుం దని చెప్పారు.

అయితే, తమ లండను ప్రయాణం, ఆంధ్రుల ఆందోళనకు భంగకరం అని మానుకున్నారా వారు ?

తాము రాయబూనిన గ్రంథం కూడా ఆంధ్రుల ఆందోళనకు భంగకర మనే మానుకున్నారా వారు?

కాంగ్రెస్సు మంత్రులను విమర్శించడం కూడా ఆంధ్రుల ఆందోళనకు భంగం కలిగిస్తుం దనే వద్దంటున్నారా వారు?

కాంగ్రెస్సు ప్రభుత్వం వచ్చాక కూడా ఆంధ్ర ప్రజలు ఆందోళన చేసి అవస్థపడవలసిం దేనా?

ఈమాటలు చెప్పడానికి సాంబమూర్తిగారే కావాలా?

వారు ఇందుకోసం యింత దూరమున్నా రావాలా?

అయితే, అయిపోయిం దేమో అయిపోయింది, సాంబమూర్తిగారు పూనుకుని ప్రజల ఆందోళన నడిపించరాదూ?

ప్రజల ఆందోళనయొక్క ప్రాముఖ్యం తమంతగా మరెవరూ గుర్తించి వుండలేదు కనక ఈబాధ్యత తమమీదే పడుతున్న దని సాంబమూర్తిగారు గుర్తించుకున్నారా?

కాంగ్రెస్సులో ఎంత శ్రద్ధ చూపిస్తున్నారో, ఆంధ్ర మహాసభలో కూడా అంత శ్రద్ధ చూపిస్తున్నారే వారు. కాంగ్రెస్సు కార్యాల మీద చూపించే శ్రద్ధను ఆంధ్రమహాసభ కార్యాలమీద కూడా చూపించ రేంమరీ?

కర్తృత్వం కాంగ్రెస్సులోనూ వక్తృత్వం ఆంధ్రోద్యమంలోనూనా?

తాము కాంగ్రెస్సులోనే వుండిపోవా లనుకుంటే ఆంధ్రమహాసభను విడిచిపెట్టి స్వేచ్ఛగా బతకనివ్వరాదూ?

పోనీ, కాంగ్రెస్సును విడిచిపెట్టేసి ఆంధ్రమహాసభనే ఆంధ్రతత్త్వానుగుణంగా నడిపితే, తమకి, కాంగ్రెస్సులోలాగ భృత్యపదవి కాక, మహానాయకత్వం లభిస్తుం దేమో — జాత్యుద్ధారకత్వమే లభిస్తుం దేమో సాంబమూర్తిగారు కొంచెం యోచించుకోగలరా?

అలాంటి దేమీ లేక, మాట్లాడితే వుపదేశం.

చేసేదీ, చేయించేదీ కనపడదు గాని "చేసుకోండి" అని ఆజ్ఞ.

వృథా. వృథా. వృథా.

అరవల జైత్రప్రస్థానం ప్రారంభ మైనది

తిరుపతిలో శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ ఇన్‌స్టిట్యూటు పేరిట ఒక విద్యాసంస్థ ప్రారంభం కాబోతున్నది దానికి కే. వి. రంగస్వామయ్యంగారు డైరక్టరుగా నియమించబడ్డారు.

అందులో సంస్కృతానికీ అరవానికీ ప్రాధాన్యం.

కాగానే వున్నది.

ఏంతప్పు?

ఆంధ్రులు "మద్రాసు మాది" అంటే అరవలు 'తిరపతి దాకా" అరవదేశమే అన్నారు.

మాటకి మాట సరిపోయింది.

కాని అరవలు అంతటితో పూరుకోలేదు.

తిరుపతి ఆక్రమించుకుంటున్నారు.

శ్రీ వెంకటేశ్వరఓరియంటల్ ఇన్‌స్టిట్యూటు వివరాలు చూస్తే అది అరవలు తిరపతి ఆక్రమించుకోవడమే అనీ, ఈవిధంగా అరవలు జైత్రప్రస్థానం ప్రారంభించా రనీ అర్థం.

కాంగ్రెస్సాంధ్రులకు సంపూర్ణస్వరాజ్యం యెదట ఆంధ్రరాష్ట్రం స్వల్పవిషయం అయిపోయింది.

ఆంధ్రరాష్ట్రమే స్వల్పవిషయం అయిపోయినప్పుడు అందులో వొక జిల్లాకు సంబంధించిన విషయం పెద్ద విషయం అవుతుందా?

కోరి కాంగ్రెస్సు ప్రభుత్వం తెచ్చిపెట్టుకున్న ఆంధ్రులకు ఇలాంటి అనుభవం కాక మరేమి వస్తుందీ?

హిందీ ముప్పు తెచ్చిపెడుతుంది

ఆంధ్రులు, ఒక్క మద్రాసు నగరంలో, నిజం తెలుసుకోగలిగితే సగానికి పైగా వున్నారు. తప్పుడు జనాభాలెక్కలను బట్టి చూసినా నాలుగోవంతు (సుమారు ౧౩౦ వేలు) వున్నారు.

కాని మద్రాసులో తెనుగుపాఠశాలలు లేవు. ఎన్నో సంబల పాఠశాల లున్నవి. వాటిలో తెనుగుపిల్లలకు కొద్దిగా అయినా తెనుగు చెప్పరు.

ఒరిస్సాలో కలిసిపోయిన—కలిపివెయ్యబడిన తెనుగు దేశంలో తెనుగు పిల్లలకు, పాఠశాలలో ఓఢ్రం నేర్పడమే మంచి దన్నారు మన ప్రధానమంత్రి రాజగోపాలాచారిగారు. తెనుగు కావలిస్తే తల్లిదండ్రులు ప్రయివేటు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ఇంటో చెప్పించుకోవా లన్నారు.

హిందీవల్ల మాతృభాషలకు కష్టం లేదంటారు కాంగ్రెస్సువారు. "మాతృభాషలే ముందు. తరవాతే హిందీ" అంటారువారు.

మరి మద్రాసులోనూ, ఒరిస్సాలోనూ తెనుగుపిల్లలకు తెను గేదీ?

తెనుగు చెప్పకుండా పాఠశాలల్లలో హిందీ నిర్బంధం చెయ్యడం దేమిటీ?

వేసవి వచ్చాటప్పటికి మద్రాసులో వీధివీధికీహిందీతరగతులేమిటీ?

మద్రాసు మంత్రాంగంలో ఆంధ్రులు లేరూ? శక్రటరీలలో ఆంధ్రు లైనవారు లేరూ?

వారి కిది కనపడదూ? ఇది సవరించాలని తోచదూ?

తెనుగుబిడ్డలకు తెనుగు చెప్పించలేక—అరవం తప్పించలేక మీదుమిక్కిలి హిందీని నిర్బంధించే కాంగ్రెస్సుమంత్రాంగం, తెనుగుభాషను బదకనివ్వడానికే తలుచుకుందా?

ప్రబుద్ధాంధ్ర సరస్వతీమందిరం

వసంతము

ఇది ఒక చిన్న భావకావ్యం. రచయిత పెమ్మరాజు లక్ష్మీపతిగారు. వెల ౦-౪-౦ కావ్యం ఆధునికము కావటంచేత కొంచెం శ్రమపడితేనే గాని అర్థంకాదు. ముఖపత్రం మీద చిత్రం "ప్రోడులు కూడ" "త్రాగెడుజాతి" అనేపద్యాలను మనస్సులో పెట్టుకొని రచించినట్లుగా ఉంది, కాని యీచిత్రంలో వైణికుని వేళ్లు తీగలను మీటడానికి బదులుగా వీణ తలపైన వాయిస్తున్నట్లుగా చిత్రించబడి ఉండటం చేత, గట్టిగా లాగి తీగలను "త్రెస్సుకొని" ఆ విషాదంతో విస్తుబోయి అతడు విచారిస్తున్నట్లుగా మనం ఊహించుకోవాలి. ఇది చిత్రకారుని లోపం. కవి ప్రకృతిని ఉపాస్యదేవతగానూ, మనోహారిణిగానూ ఆరోపించుకొని మిత్రునివివాహవ్యాపారాలకు అనుగుణంగా వసంతశోభలను వర్ణించాడు. "కోయిలపాటతో" వసుమతిపైన వసంతుని సాక్షాత్కరింపజేసుకొని మిలితకళావిలాసముల" తో ఇలాతలానస్వర్గాన్ని అవతరింపజేసుకొని "కాలనిమిత్త దేశపరిఘావృతదుర్గమమైన యీ మర్త్యాన్ని "దాటిబోయి" అతీయలౌకిక ప్రపంచంలో ప్రవేశిస్తాడు, కవి అక్కడ సురపతిగా మారి ఒ 'కామె' కు కుసుమాసవమషీరసంలో ముంచి, విరికేసరపుకలంతో, కమలపత్రంపైన అక్షరాలు వ్రాసి ప్రేమలేఖ పంపుతాడు, ఇక నామెను గూర్చి ఆవేగమనుభవిస్తాడు. ఆమె చివరవరకూ రంగానికి రానూ రాదు. "ఆమె" ఎవరో కవి మనకు చెప్పనూ చెప్పడు. ప్రకృతివిలాసిని లేక వసంతలక్ష్మి అని అనుకోవాలి మనం. ఇదీ ఇతివృత్తం.

శ్రద్ధతో పరిశీలిస్తే కావ్యం అంతటా ఏదో ఆలౌకికానుభవాన్ని ప్రకృతిగతంగా నిరూపించటానికి కవి వ్యవసాయముచేసినట్లు కనిపిస్తుంది, కాని కవిత్వంలో ప్రసాదగుణం తక్కువకావడం చేత ఎంత ఔన్నత్యం కలదైనా అతని భావాలు నిబిడతమస్సులో పర్వతాలలాగా వెనకనే ఉండిపోతున్నాయి, "పగలబడి నవ్వుచున్నదీ ప్రకృతికాంత" "కష్టసుఖములు పడుగుపేకలుగ జననమరణములె యంచులుగ నేయు మర్త్యజీవి" మొదలైనచోట కవిభావం తారస్థాయిదాటింది, కావ్యంలో చాలాచోట్ల మనస్సును మరపించే భావాలు ఇమిడిఉన్నాయి, కాని గూట్లో కూర్చుని కూసే పావురాలలాగా అవి కూజితమాత్ర వేద్యాలుగా ఉన్నాయి. అందుకనే పూర్వులు కవితకు ప్రసాదగుణాన్ని ప్రధానాంగంగా నిర్ణయించారు. "ఘనతరశాస్త్రవాసనలు గాలికి దూలి చనంగ వెన్కనిల్చిన" వాడీకవి. పదార్థతత్త్వశాసనములూ, పరమజ్ఞానపటిష్ఠములూ, అయినశాస్త్రమర్యాదలను ఆధునికకవులు ఒప్పరికించడం విచారకరము. శాస్త్రనిర్దిష్టాలైన అరసున్నాలూ, సాధుశకటరేఫలవిచక్షణాలూ, జాతీయతా, నుడికారం, అతిక్రమించడం తగనిపని.

"మోజులు" అని అంటే చిగుళ్లు అని అర్థంరాదు, మోసులు, అని ఉండాలి. "ప్రకృతీ కపోలచుంబనము" "ప్రకృతికాంత" లింగవిపర్యాసం. "ఎదురు చూచెడి నీకు" తురకషష్ఠి, "పూరజము" సంకరసమాసం. "నీలనభంబు ఛాయ" లు దాటిబోవు" కుసంధులు. "పువ్వునవ్వుల మవ్వమొలయు" "ఏతెంచుచునుండె బోజగములిన్నియు" యతిభంగం. "కుసుమాసవమషీరసము" ప్రకృతివిరుద్ధము.

కేవలం ఋతువుల వర్ణనలతోనే కావ్యాన్ని నింపి రచించేపద్ధతి "ఋతుసంహారాది కావ్యాల్లో ఉన్నా ఇది ఒక క్రొత్తతరహా కావ్యం. ఊహలు పెద్దవైనా వాటిని ఆవిష్కరించే సామగ్రి బొత్తిగా పేదరిమి అనుభవిస్తున్నది. ఇతరవిషయాల్లో కావ్యం చాలా బాగుంది"

కొమరబోలు వెంకటసుబ్బారావు బి. ఎ.

సరస్వతిగ్రంథమండలి

కంభంవారి సత్రము వీథి *** రాజమహేంద్రవరము

నవలలు—నవరసభరితములగు నవలలు—ముచ్చటగూర్చు అచ్చుతో—ముద్దులొలుకు క్యాలికో బయిండుతో—రెండుమాసముల కొక్కొక్క నవల. నడుమ నడుమ చిన్నచిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0–4–0 చందాదారులు ఒకేసారి రు 7–8–0 ను ముందుగా పంపినచో వరుసగా ఆరుపుస్తకములు అన్‌రిజిస్టర్డు పార్శిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11	ప్రేమసుందరి	1	8	0
12	చోరశిఖామణి	1	8	0
13	లక్ష్మీప్రసాదము	1	8	0
14	హత్యారహస్యము	1	8	0
15	ఫాస్టు (1 వ భాగము)	1	8	0
16	ఫాస్టు (2 వ భాగము)	1	8	0
17	కుముద్వతి	1	8	0
18	చిన్నకోడలు	1	8	0
19	రహస్యభేదనము	1	8	0
20	సింహగడము	1	8	0
21	మణిహారము	1	8	0
22	మొగలాయీదర్బారు 1 వ భా॥	1	8	0
23	ఘటనాచక్రము	1	8	0
24	రాజసుందరి	1	8	0
25	కుంకుమభరణి	1	8	0
26	జాగిలము	1	8	0
27	మొగలాయీదర్బారు 2 భా॥	1	8	0
28	సరస్వతి	1	8	0
29	ఆనందాభాయి	1	8	0
30	హత్యాన్వేషణము	1	8	0
31	మొగలాయీదర్బారు 3 భా॥	1	8	[illegible]
32	గంగ	1	8	0
33	మొగలాయీదర్బారు 4 భా॥	1	8	0
34	కోహినూరు	1	8	0
35	ఆటిన్ మణోల	1	8	0
36	అపరచిత	1	8	0
37	అంతఃపురము (1 వ భాగము)	1	8	0
38	అంతఃపురము (2 వ భాగము)	1	8	0
39	అగ్రహారము	1	8	0
40	ఛిన్నహస్తము (1 వ భాగము)	1	8	0
41	ఛిన్నహస్తము (2వ భాగము)	1	8	0
42	కంకణరహస్యము	1	8	0
43	సంజీవి (1 వ భాగము)	1	8	0
44	సంజీవి (2 వ భాగము)	1	8	0
15	ప్రజారాణి	1	8	0
46	హత్యాభ్రమ	1	8	0
47	కాశీఖండము	1	8	0
48	సేవాశ్రమము (1వ భాగము)	1	8	0
49	సేవాశ్రమము (2 వ భాగము)	1	8	0
50	దాసీకన్య	1	8	0
51	స్త్రీసాహసము ప్రథమభాగము	1	8	0
52	స్త్రీసాహసము 2 వ భాగము	1	8	0
53	మేరీరాణి	1	8	0
54	రాజ్యలక్ష్మి	1	8	0
55	లీల	1	8	0

అనుబంధములు

1	మృత్యుతరంగిణి	0	12	0
2	అభాగిని	0	12	0
3	ఛద్మవేషి	0	12	0
4	విదురుని యుపదేశములు	1	0	0
5	కాంచనమాల	1	0	0
6	సీమంతిని	1	0	0
7	సుశీల	1	0	0
8	శశిరేఖ	1	0	0
9	యమునాబాయి	1	0	0
10	శ్యామల	1	0	0
11	కాంతం కథలు (చిన్నకథలు)	1	0	0
12	కాలసర్పి	1	0	0
13	భారతకథాసారం	1	0	0
14	కథాకల్పవల్లి (చిన్నకథలు)	1	0	0
15	అరక్షణీయ	1	0	0
16	మాధవి	1	0	0
17	లలిత	1	0	0
18	పెండ్లిదండ	1	0	0
19	కథావళి	1	0	0
20	నాలుగుకథలు	1	0	0
21	నీతిప్రబోధిక	1	0	0
22	ఆదర్శము (1 వ భాగము)	0	12	0
23	ఉదంకుడు	0	12	0
24	భేతాళకథలు	0	12	0
25	దయ్యాలు	0	12	0

నాటకములు

1	మార్కండేయ	0	12	0
2	అహల్యాశాపవిమోచనము	0	12	0
3	మీవారుపతనము	1	0	0
4	వరమాల	1	0	0
5	షాజహాను	1	0	0
6	నూర్జహాను	1	0	0
7	దుర్గాదాసు	1	0	0
8	చంద్రగుప్త	1	0	0
9	దంపతులు	1	0	0
10	విజయవిజయం	1	0	0
11	భక్తకుచేల	1	0	0

ఈ పుస్తకాలు రాజమండ్రీ కలాభివర్ధనీ పరిషత్తులోకూడా దొరుకును

వస్తుగుణప్రకాశిక

గిల్టు క్యాలికో బైండులో, అనుబంధములతో 1150 పేజీల గ్రంథము

ఇది సమస్త వస్తువులయొక్క గుణములను సంపూర్ణముగ తెలియజేయు నూతనగ్రంథము. ఆంధ్రవైద్య లోకమునకు, స్త్రీ పురుషులకు మిక్కిలి యుపయోగకరమగునటుల సుప్రసిద్ధ ఆయుర్వేదవైద్యశిఖామణులు ఆయుర్వేదభూషణ, భిషగ్వర, పండిత బ్రహ్మశ్రీ వీటూరి వాసుదేవశాస్త్రి ఏ. ఎమ్. ఏ. సి. గారిచే వ్రాయబడినది. ఈగ్రంథమునందు ఉపయోగకరమగు పెక్కు వస్తుగుణములే 1104 పేజీలు గలవు. ఇవిగాక వివిధరోగములయొక్క ఉత్పత్తి, వాటి చికిత్సలు 50 పేజీలవరకు అనుబంధములుగా చేర్చబడి, మొత్తము గ్రంథము 1150 పేజీలను కలిగి యున్నది. వస్తువులయందుగల రస, వీర్య, విపాక ప్రభావములును, వాటిస్వరూపములును, గుణములును ప్రయోగములును ఈగ్రంథమునందు చక్కగ నిరూపింపబడినవి. వస్తుప్రయోగములు వంగసేన, వాగ్భటము, చరకము, నటకర్ణి, సుశ్రుతము, భావప్రకాశిక, భైషజ్యరత్నావళి, చక్రదత్త, హారీతసంహిత, ఆర్. ఎన్. ఖోరీ మొదలైన వివిధవైద్య గ్రంథరాజములనుండి సేకరింపబడి తద్గ్రంథముల పేళ్లతో నిందు పొందుపరుపబడినవి.

వైద్య సాహాయ్య మవసరము లేకయే యీగ్రంథమువలన సామాన్యరోగములన్నిటికి బజారులలో దొరకు సాధారణ వస్తువులతో చికిత్సలు జరుపుకొనవచ్చును. ఇది ప్రతియింట నుండదగిన అమూల్య గ్రంథము.

వెల రు. **5-0-0** (పోస్టుఖర్చులు ప్రత్యేకము)

వలయువారు :—

☞ సరస్వతి పవర్ ప్రెస్, రాజమండ్రి

అని వ్రాయవలెను

వస్తుగుణప్రకాశిక మాదిరి పేజీ

ద్రాక్ష.—ద్రాక్ష - మృద్వీకా - గోస్తని—Vitis Vinifera.

జాతిభేదములు: ద్రాక్ష - Grapes. ఎండుద్రాక్ష - Sultanas. నల్లద్రాక్ష - Black large grapes. గింజలేని ద్రాక్ష చిన్నది - Muscateles. పొడవుద్రాక్ష - Raisians (Monakha)

స్వరూపము: ఇది ఉత్తమలతాజాతిలోనిది. ఇది చాల దూరము వరకును ప్రాకును. దీని యాకు 4 లేక 5 కోణదళములు గలిగి దళముల చుట్టును స్పష్టముగు కంగోరా గలిగి అంచేలివలెను, ఆకురంగు నలుపు. ఆకుపచ్చ కలిసిన రంగు గలగ యుండును. ఈలత కచ్చుటచ్చులు చిన్న యూడలు కూడ నుండును. ఆకుల సందులనుండి లతాకాండ మాధారముగా గొని కోలనగు పూగుచ్ఛకాండము లేచును. నులితీగలు కూడ కాండము నుండియే వెడలును. ఈనులితీగెలే దీనికి విత్తనము. దీని ప్రకాండము పలకలుగా నుండును. ఆకులు విడివిడిగా నుండును. పుష్పములలో కొన్ని మిథునములుగను, కొన్ని ఏకలింగములుగను గలవు. ఉండవలసినన్ని కింజల్కములు కూడ గలవు. పుష్పకాండమునుండియే కాయలు లేచును. యీ ఫలగుచ్ఛము గుండ్రముగను, కోలగను గూడ నుండును. ఒక ఫలగుచ్ఛమునకు రమారమి వందకాయలవరకును ఉండును. ఫలగుచ్ఛము కాళీలేకుండ దట్టముగా ఉండును. కొన్ని పళ్లు తెల్లగను, కొన్ని నల్లగను ఉండును. యీతీగ సాధారణముగా శీతలప్రదేశములో ఎక్కువగా పెరుగును. ఇది బెంగుళూరునందును, మలబారు, సేలం, పంజాబు ప్రదేశములయందును ఎక్కువగా పెరగును. దీనికి తేమగాలి పనికిరాదు. దీని కొమ్మలు అడ్డముగా పాతవలయును. ఇది జనుముతో దమ్ముచేసిన భూములలో పాతుదురు. ఇది అయిదారు అడుగులు ఎత్తు పెరిగిన తరువాత కొనలను కత్తిరించవలెను. దీనివలన ప్రక్కనుండు కొమ్మలు పెరుగును. కత్తిరించిన పిమ్మట పువ్వులు పూసి కాయుట కారంభించును. యీ పండ్లనుండి సారాయిని, బ్రాందిని తీయుదురు. దీని పండ్లే ఔషధమునకు ఉపయోగము

అన్వర్థసంజ్ఞాపదములు : గుచ్ఛఫల - గుత్తుగుత్తులుగా నుండు ఫలములు గలది. చారుఫల - అందముగా నుండు ఫలములు గలది. రసాల - రసప్రధానమగు ఫలము. కాశ్మీరికా - కాశ్మీరదేశముల నుండునది.